ప్రజాశక్తి

శుక్రవారం 22 సెప్టెంబర్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

దళితులకు దక్కని రైతు భరోసా

- ఆన్‌లైన్‌లో హక్కుదార్లకు బదులు ఇతరుల పేర్లు నమోదు
- పొరపాట్లు సరిచేయని రెవెన్యూ అధికారులు
- పట్టించుకోలేదని వెదురువాడ బాధితుల ఆవేదన

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని యలమంచిలి నియోజకవర్గం పరిధి అచ్యుతాపురం మండలం వెదురువాడ దళితులకు భూమిపై యాజమాన్య హక్కు ఉన్నా రైతు భరోసా నిధులు మాత్రం పడ్డంలేదు. ఎన్నిసార్లు రెవెన్యూ, వ్యవసాయశాఖాధికారుల దగ్గరకు వెళ్లినా పరిష్కారం దొరకలేదు. వివరాల్లోకి వెళితే... వెదురువాడ రెవెన్యూ సర్వే నెంబర్ 1లో వెదురువాడ ఎస్‌సి కుటుంబాలకు 70 సెంట్లు చొప్పున 2005 జనవరి 21న అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి డి పట్టా అందజేశారు. డి పట్టాతో పాటు పట్టాదారు పాస్ పుస్తకం లబ్ధిదారులకు ఇచ్చారు. కూలి పనులు తప్ప బతకడానికి ఈ కుటుంబాలకు మరో ఆధారంలేదు. ప్రభుత్వం ఇచ్చిన డి పట్టా భూములపై యాజమాన్య హక్కు పత్రాలు కల్గిన దళిత కుటుంబాలన్నీ రైతు భరోసా పడుతుందని ఆశపడ్డాయి. డి పట్టా లబ్ధిదారుల్లో కొంతమందికి భరోసా నిధులు జమయ్యాయి. జమకానివారంతా తహశీల్దార్, వ్యవసాయశాఖాధికారుల వద్దకు వెళితే అసలు సమస్య బయటపడింది. డి పట్టా, పాస్ పుస్తకం చేతిలో ఉన్నాయని ధీమాగావున్న దళితుల పేరున ఆన్‌లైన్‌లో భూమి నమోదుకాలేదు. దళిత లబ్ధిదారుల బదులు ఇతరుల పేరు ఆన్‌లైన్‌లో ఉండడంతో రైతు భరోసా రాలేదని తెలిసి న్యాయం కోసం రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లారు. ఎన్నిసార్లు తిరిగి ప్రాధేయపడినా ఖాళీగావున్నామా? అంటూ అధికారులు కోపం ప్రదర్శిస్తున్నారు తప్ప సమస్యకు పరిష్కారం చూపలేదని దళితులు వాపోతున్నారు. ఆన్‌లైన్‌లో దళిత లబ్ధిదారుల పేర్లు నమోదుచేయని కారణంగా రైతు భరోసా వారికి అందడంలేదు. వెదురువాడ ఎస్‌సి కాలనీకి చెందిన మైలపల్లి అప్పలనర్స (భర్త అప్పారావు)కు సర్వే నెంబరు 235/5లో 70 సెంట్లలో డి పట్టా ప్రభుత్వం ఇచ్చింది. అప్పలనరసమ్మకు

మిగతా 2లో..

ఆన్‌లైన్‌లో పేరు సరిచేయలేదు

నా భార్య మైలపల్లి మాణిక్యం పేర వెదురువాడ సర్వే నెంబర్ 239/1లో 70 సెంట్లు ప్రభుత్వం డి పట్టా ఇచ్చింది. రైతు భరోసా పడలేదని వ్యవసాయాధికారుల దగ్గరకు వెళితే ఆన్‌లైన్‌లో కిల్లాని కొండమ్మ పేరు ఉండడంతో భరోసా రాలేదని చెప్పారు. విఆర్‌ఒను అడిగితే ఆన్‌లైన్‌లో పేరు మార్చేస్తామని చెప్పారు. అప్పటి నుంచి ఎన్నిసార్లు కలిసినా పనిచేయలేదు. తహశీల్దార్ ఆఫీసుకు వెళితే అదిగో, ఇదిగో అంటున్నారు తప్ప న్యాయం చేయలేదు.



మైలపల్లి చిన్నారావు,
ఎస్‌సి కాలనీ, వెదురువాడ

పత్రాలిచ్చినా నమోదుచేయలేదు

70 సెంట్లు డి పట్టా, పాస్ పుస్తకం ప్రభుత్వమిచ్చింది. రైతు భరోసా పడలేదని వెళితే ఆన్‌లైన్ చేస్తే పడుతుందని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన భూమి పత్రాలన్నీ చూపెడుతున్నా పట్టించుకోవడంలేదు. ఆన్‌లైన్ చేయడంలేదు.



మైలపల్లి అప్పలనరసమ్మ,
ఎస్‌సి కాలనీ, వెదురువాడ

వుడా బహిరంగ స్థలాలకు రక్షణ ఏదీ?

- రూ.కోట్ల విలువైన 600 గజాలు కబ్జాకు యత్నం
- పార్క్ కోసం స్థలం ఉంచేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి
- ఎండాడ శాంతిపురంలో స్థానికుల ఆవేదన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలో ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల కబ్జాలు, భూముల కైంకర్యానికి యత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి. నగరంలోని ఎండాడ, రుషికొండ ప్రాంతాలు ఇందుకు అడ్డాగా మారిపోయాయి. సాగర తీరం కావడంతో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు అక్కడ రాబందులు వాలిపోవడం కనిపిస్తోంది. తాజాగా ఎండాడ శాంతినగర్ సమీపంలో సర్వే నెంబర్ 83లో రూ.కోట్ల విలువైన 600 గజాల వుడా ప్రైవేట్ ఎల్‌పి లే-అవుట్ కబ్జా చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ విషయంపై స్థానిక ప్రజానీకం చాలా ఆవేదన వ్యక్తం చేస్తూ వుడా నుంచి జివిఎంసికి కొన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఎల్‌పి లే-అవుట్‌లు హేండోవర్ అయ్యాయని, వాటికి రక్షణ లేకుండా పోతుందంటూ వెల్లడించారు. సర్వే నెంబర్ 83 పార్క్ కోసం ఉద్దేశించిన స్థలంగా ప్రైవేట్ వుడా ఎల్‌పి లే-అవుట్‌గా ఉండాల్సింది కాగా ఇక్కడ గడచిన కొన్ని నెలలుగా ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తి పాగా వేసేందుకు విశ్వయత్నాలు చేస్తున్నారు.

పాకల్లో అసాంఘిక కార్యకలాపాలు, బెల్టుషాపులు

పాకలు వేసి బెల్టు షాపులు నిర్వహించడం, ఏ చిన్న పండగ, అమ్మవారి జాతర్ల సందర్భంగా కోడి పందాలకు ఇచ్చి డబ్బులు గుంజుకోవడం వంటి కార్యకలాపాలకు నిలయంగా ఈ ప్రైవేట్ వుడా ఎల్‌పి లే-అవుట్ మారిపోయింది. వుడా, జివిఎంసి ఈ స్థలాలకు గతంలో మార్కింగ్ చేసి పెన్సింగ్ వేసేవారు. ఈ స్థలాన్ని అలా వదిలేయడంతో కబ్జాకోర్ల కళ్లు పడ్డాయి. ఇదే లే అవుట్‌లో అసాంఘిక కార్యక్రమాలు, బెల్టు షాపు పెట్టి మందు అమ్మకంపై ఓ మహిళ (కబ్జాకు పాల్పడిన)ను పోలీసులు పట్టుకున్నా సరైన చర్యలు తీసుకోలేదు. జివిఎంసి యంత్రాంగం కూడా ఈ స్థలాన్ని పరిరక్షించాలన్న ఆలోచన చేయపోవడంతో ప్రస్తుతం 24 గంటల బెల్టు షాపు నడుస్తూ మందు బాబులకు నిలయంగా మారిందంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. గోడ కట్టి వుడా ఈ లే అవుట్‌ను పదిమందికి పనికొచ్చే పార్క్ కోసం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. నెలల తరబడి ఈ స్థలాన్ని ప్రభుత్వ యంత్రాంగం వదిలేయడంతో దీనికి ఇంటిపన్ను, కరెంట్ బిల్లు తెచ్చుకుని పొజిషన్‌లోకి తీసుకుని కబ్జా చేసే యత్నాల్లో ఉన్నారన్నది తెలుస్తోంది.



ఆక్రమణకు గురవుతున్న స్థలం

మార్కెట్ విలువ అధికం...

ఎండాడ పరిసర

మిగతా 2లో..

జగనన్న కాలనీ నిర్మాణాలు వేగవంతం : కలెక్టర్

వార్త 2లో..

నిర్వాసితుల గోడు పట్టదా

వార్త 4లో..

తెలుగు అందమైన భాష : విజయబాబు

వార్త 2లో..

జగనన్న కాలనీ నిర్మాణాలు వేగవంతం : కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జిల్లాలో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం వియంఆర్‌డిఎ, హౌసింగ్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి జగనన్న లే-అవుట్లలో నిర్మాణంపై వెబెక్స్ ద్వారా జిల్లాలోని ఎస్ఇలు, డిఇలు ఎఇలు, అన్ని మండలాల ఎంపిడిఒలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగనన్న లే-అవుట్లలో సకాలంలో ఇళ్ల నిర్మాణం జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పని ప్రారంభించిన ప్రతి ఇంటికి బ్యాంక్ అకౌంట్లు ఓపెన్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు.

ఎప్పటికప్పుడు ఇళ్ల నిర్మాణాల స్టేజి అప్‌డేషన్ చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, స్టీల్, సిమెంటును లే-అవుట్లకు ఎప్పటికప్పుడు సరఫరా చేసేలా చూడాలని, సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణాలు పూర్తి చేసిన ఇళ్లకు కరెంట్ అందించాలని ఈపిడిసిఎల్ ఎస్ఇని ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా అధికారులు కాలనీల్లో మంచినీటి కుళాయి సౌకర్యం కల్పించాలన్నారు. ఆప్షన్-2 ద్వారా నిర్మించుకున్న ఇళ్లకు పబ్లిక్ బ్యాంకులు పెద్ద ఎత్తున రుణాలు అందించి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, వియంఆర్‌డిఎ, బ్యాంకు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

దళితులకు దక్కని రైతు భరోసా

శివలక్ష్మి అనే కూతురు ఉంది. అప్పలనరసమ్మ చనిపోయి పదేళ్లు దాటుతున్నా ఆమె కూతురు శివలక్ష్మి పేరిట పట్టా మార్చలేదు. తన పేరున పట్టా మార్చాలని ఎన్నిసార్లు తిరిగినా పట్టించుకోకపోవడంతో రైతు భరోసా రాలేదని శివలక్ష్మి ప్రజాశక్తి వద్ద ఆవేదన వ్యక్తం చేసింది.

వుడా బహిరంగ స్థలాలకు రక్షణ ఏదీ?

ప్రాంతాల్లో ప్రభుత్వ విలువ గజం రూ.25వేలుండగా బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.70వేలకు పైమాటే ధర పలుకుతోంది. 600 గజాల పార్క్ స్థలంపై జివిఎంసి మధురవాడ జోన్ అధికారులు ఇప్పటికైనా స్పందించి స్వాధీనం చేసుకోకపోతే కబ్జారాయుళ్ల గుప్పెట్లోకి వెళ్తుందన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. బెల్టు షాపులు, ఇతర సంఘ వ్యతిరేక కార్యకలాపాల కోసం వేసిన తాత్కాలిక పాకల షెడ్లను తొలగించాలన్న డిమాండ్ స్థానికుల నుంచి వస్తోంది.

టవర్-సిలో వినాయక చవితి వేడుకలు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : సీతమ్మధార ఎవిఎమ్ హాస్పిటల్ వెనుక టవర్-సి అపార్ట్‌మెంట్‌లో 4వ వార్షికోత్సవ, వినాయక చవితి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. రూ.1, రూ.10, రూ.20 నోట్లతో వినాయకుని అలంకరించారు. ఈ వేడుకలలో భాగంగా చిన్నారులకు వినాయకుని గురించి వ్యాసరచన, పెయింటింగ్, పాటలు, వినాయకుని ప్రతిమల తయారీ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పూజలలో భాగంగా మహిళలు కుంకుమ పూజ, దీపారాధన, గరిక పూజ, లక్ష్మీ గణపతి హోమం, అన్న సంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో చివరిగా లడ్డు వేలం, కరెన్సీ వేలం నిర్వహించారు. తదుపరి సాగర తీరాన నిమజ్జనం చేసినట్లు టవర్-సి అపార్ట్‌మెంట్ కల్చరల్ కమిటీ సభ్యులు తెలిపారు.

ముగ్గురికి మానసిక వ్యాధి నయం

శ్రద్ధా ఫౌండేషన్‌కు అప్పగింత

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఎయుటిడి, జివిఎంసి నిరాశ్రయ వసతి గృహాల్లో మానసిక వ్యాధి నయమైన ఒడిశాకు చెందిన రామచంద్ర ముర్మ(60), దయాబా (55), ఉత్తరప్రదేశ్‌కు చెందిన అమరీష్ (50)ను ఖజరత్ (పూనె) కేంద్రంగా పనిచేస్తున్న శ్రద్ధా ఫౌండేషన్‌కు అప్పగించామని ఎయుటిడి కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. మానసిక ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ తీసుకున్న 11 మందిలో బాగా రికవరీ అయిన ముగ్గురిని కుటుంబ సభ్యులకు అప్పగించడం కోసం శ్రద్ధా టీమ్‌ను రప్పించినట్లు చెప్పారు. జివిఎంసి కమిషనర్ ఆదేశాల మేరకు ఇప్పటి వరకు నాలుగు విడతలుగా 55 మంది రోగులను బయట రాష్ట్రాలలో ఉన్న కుటుంబ సభ్యులకు శ్రద్ధా ఫౌండేషన్ ద్వారా అప్పగించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రద్ధా ఫౌండేషన్ ప్రతినిధి ప్రదీప్ శిద్ధు పాల్గొన్నారు.

వైవి సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : యాదవ కుల సంక్షేమ సంఘానికి అర ఎకరం స్థలం కేటాయించినందుకు సహకరించిన ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త వైవి.సుబ్బారెడ్డికి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, యాదవ కులానికి చెందిన కార్పొరేటర్లు, యాదవ కుల సంఘాల సభ్యులు ప్రభుత్వ అతిథి గృహంలో గురువారం కృతజ్ఞతలు తెలిపారు. సాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, యాదవుల సంక్షేమ భవనం నిర్మించుకునేందుకు స్థలం ఏర్పాటుచేయాలని ఆర్జీ సమర్పించిన వెంటనే కేబినెట్ మీటింగ్‌లో చర్చించి ఎండాడ వద్ద అరఎకరం స్థలం కేటాయించారని, దీనికి వైవి.సుబ్బారెడ్డి సహకారం ఎంతో ఉందని తెలిపారు.

యుసిడి పీడీపై చర్యకు డిమాండ్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జివిఎంసి అవినీతి తిమింగలంగా మారి, అసభ్య పదజాలంతో కింద స్థాయి అధికారులు, సిబ్బందిని వేధింపులకు గురిచేస్తున్న యుసిడి ప్రాజెక్టు డైరెక్టర్ పాపునాయుడుపై చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేపడతామని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ తెలిపారు. ఈ మేరకు మేయర్ హరివెంకటకుమారి, జివిఎంసి కమిషనర్ సాయికాంత్‌వర్మకు గురువారం వినతిపత్రం అందించి తెలియజేశారు. ఈ సందర్భంగా మూర్తియాదవ్ మాట్లాడుతూ, ఎక్సైజ్ శాఖ నుంచి డిప్యూటేషన్‌పై ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా వచ్చిన ఆయన అవినీతి అక్రమాలపై నెలన్నర క్రితం ఫిర్యాదు చేసినా మేయర్, కమిషనర్ ఎటువంటి చర్యలు గానీ, విచారణకు గానీ ఆదేశించలేదన్నారు. ఆదర్శ గ్రామం ప్రాజెక్ట్‌లో భాగంగా పెద్ద వాల్తేరులో నిర్మించిన గృహ సముదాయాల కేటాయింపుల్లో పాపునాయుడు పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారని, రూ.లక్షల్లో లంచాలు తీసుకున్నారని ఆరోపించారు. సెంట్రల్ పార్క్ వద్ద ఫుడ్ కోర్టును రద్దుచేస్తూ జివిఎంసి తీర్మానం చేసినా, దానికి విరుద్ధంగా పాపునాయుడు వ్యవహరిస్తూ రోజు వారీ మామూళ్ళు వసూలు చేస్తూ వాటిని కొనసాగిస్తున్నారని తెలిపారు. యుసిడి విభాగంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ (సిఒ) ఉద్యోగాలు వేయిస్తానంటూ రూ.5 లక్షలు చొప్పున మొత్తం రూ.కోటికి పైగా వసూలుచేసినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. పాపునాయుడు నుంచి అసభ్యకరమైన కామెంట్స్ వస్తున్నాయని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

కెజిహెచ్‌లో 'ఒపి'కి ఆన్‌లైన్ వద్దు : సిపిఐ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : కెజిహెచ్‌తో సహా ప్రభుత్వ ఆసుపత్రులలో ఓపి చీటీల పంపిణీ కోసం కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ విధానం రోగుల సహనాన్ని పరీక్షిస్తోందని, వెంటనే ఆ విధానానికి స్వస్తి పలికి పాత పద్ధతి అమలుచేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపి టికెట్ల జారీ అభా యాప్ ద్వారా చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యాన కెజిహెచ్ ఎదుట గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్యులను త్వరగా కలిసి, చికిత్స పొందాలని ఎదురుచూసే రోగులకు ఆన్‌లైన్ కష్టాలు తప్పడం లేదన్నారు. ఆభా (ఆయుష్మాన్ భారత్) యాప్‌లో రోగి వివరాలను నమోదు చేసి, ఓపీ చీటీలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని, అత్యవసర వైద్యసేవలు అందించేందుకు విఘాతం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సాధారణ విధానంలో ఓపీ చీటీలు ఇస్తూ, సమాంతరంగా ఆన్‌లైన్ ద్వారా కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కెజిహెచ్ ఇన్‌ఛార్జి పర్యవేక్షణ వైద్యాధికారి డాక్టర్ రాధాకృష్ణ, ఎడి శ్రీనివాస్ ధర్నానుద్దేశించి మాట్లాడుతూ ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్ ఓపీలు కూడా కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.విమల, కె.సత్యనారాయణ, ఎస్‌కె.రెహమాన్, జి.రాంబాబు, ఆర్.శ్రీనివాసరావు, పి.చంద్రశేఖర్, జి.ఎస్ క్షేత్రపాల్, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పోరాటం ఆగదు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని చేపట్టిన ఉద్యమం ఆగేది లేదని, దీనిని మరింత ఉధృతంగా సాగిస్తామని స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఎంఎస్ యూనియన్ అధ్యక్షుడు దొమ్మేటి అప్పారావు తెలిపారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కార్మిక సంఘాల జేఏసీ చేపట్టిన దీక్షలు గురువారం నాటికి 901వ రోజుకు చేరాయి. దీక్షల్లో హెచ్‌ఎంఎస్ యూనియన్ నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర జిల్లాల్లోని అన్ని తరగతుల ప్రజలను స్టీల్‌ప్లాంట్ రక్షణ ఉద్యమంలోకి రాబట్టడానికి పోరుయాత్ర సాగుతుందని చెప్పారు. ఈ యాత్రకు మంచి ఆదరణ లభిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఇప్పటికైనా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆలోచనను కేంద్రం విరమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ నాయకులు జి.సత్యారావు, పి.శ్రీరాములు, జి.రమణ, సి.అప్పారావు పాల్గొన్నారు.

24న 'సిల్వర్ ఓక్స్ స్ట్రీట్ స్టోర్' నిర్వహణ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : వినూత్న బోధన, స్వదేశీ పరిశోధన నేతృత్వంలోని పాఠ్యాంశాలతో 22 ఏళ్లుగా నడుస్తున్న సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యాన 'సిల్వర్ ఓక్స్ స్ట్రీట్ స్టోర్' అనే ప్రత్యేకమైన ఛారిటబుల్ పాప్ - అప్ ఈవెంట్‌ను ఈ నెల 24 నిర్వహిస్తున్నట్లు పాఠశాల యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. ఆదివారం ఉదయం 9:00 నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు ఉంటుందని వివరించారు. సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు వారి ఇంటి నుంచి, బంధువులు, స్నేహితుల దగ్గర నుంచి ఉపయోగించని, అనవసరమైన వస్తువులు, పుస్తకాలు, బొమ్మలు, మంచిగా ఉండే పాత బట్టలు, ఇతర ఉపయోగకరమైన వస్తువులను సేకరించి ఈ స్టోర్‌లో పెడతారని తెలిపారు. నిరుపేదలు ఎవరైనా రుషికొండ, విశాఖపట్నం సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు విచ్చేసి అవసరమైన వస్తువులను తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఎవరైనా ఈ ఉదాత్తమైన సేవలో భాగం కావచ్చని తెలిపారు. ప్రాథమిక అవసరాలను తీర్చుకోలేని వారి జీవితాల్లో ఆనందం తీసుకురావడానికి ఈ మిషన్‌లో చేరవచ్చని పేర్కొన్నారు.

తెలుగు అందమైన భాష : విజయబాబు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ప్రపంచంలోని భాషలలో తెలుగు అందమైన భాష అని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాషా అభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షులు పి.విజయబాబు అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖలలో తెలుగు భాషా అమలు తీరుపై గురువారం ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో భాషావేత్తలు, కవులు, కళాకారులు, సాహిత్యవేత్తలు, తెలుగు భాషా అభివృద్ధికి కృషి చేసినవారందరికి సత్కరించుకోవలసిన అవసరం ఉందన్నారు. ఉద్యోగస్తులలో కూడా ఎంతో మంది కవులు సాహిత్యవేత్తలు ఉన్నారని, వారిని గౌరవించవలసిన అవసరం ఉందన్నారు. తెలుగు భాషను సంప్రదాయ భాషగా, లౌకిక భాషగా పాలన అవసరాల మేరకు మనుగడకోసం వ్యవహారిక భాషను భావితరాలకు అందించవలసిన అవసరం మన అందరిపై ఉందన్నారు. త్వరలో తెలుగు భాషపై వెబ్ సైట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉత్తరాంధ్ర సాహిత్యసదస్సును పండగలా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే జరపాలని చెప్పారు.

బ్రిక్స్ సదస్సుకు రామకృష్ణ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : దక్షిణాఫ్రికాలోని డర్బన్ సిటీలో ఈ నెల 26, 27 తేదీలలో జరుగనున్న బ్రిక్స్ దేశాల ట్రేడ్ యూనియన్ల ఫోరం సదస్సుకు విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి జె.రామకృష్ణ హాజరు కానున్నారు. ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ నుంచి తనకు ఆహ్వానం అందిందని రామకృష్ణ మీడియాకు తెలిపారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం సాగే పోరాటాన్ని, మన దేశంలో పబ్లిక్ సెక్టర్‌ను ప్రైవేటీకరణ చేయకుండా అభివృద్ధి బాటలో నడిచే విధంగా మేడిన్ ఇండియా, మేక్ ఇండియాగా చేయాలన్న విషయాలు భారతదేశం తరపున బ్రిక్స్ దేశాల సదస్సులో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

నేవీలో హిందీ పక్షోత్సవాలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : తూర్పు నౌకాదళ కమాండ్ ఆధ్వర్యాన హిందీ పక్షోత్సవాలు బుధవారం స్వర్ణ జ్యోతిలో ప్రారంభమయ్యాయి. అక్టోబర్ 5వ తేదీ వరకు జరిగే ఈ పక్షోత్సవాల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా రియర్ అడ్మిరల్ సందీప్ ప్రధాన్, హాజరయ్యారు. ఈ సందర్భంగా సందీప్ ప్రధాన్ మాట్లాడుతూ, అధికారిక పనుల్లో హిందీ వినియోగం ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు.

ఉక్కు రక్షణ బైక్ యాత్రను జయప్రదం చేయండి

29న కూర్మన్నపాలెం బహిరంగ సభకు రావాలని సిపిఎం విస్తృత ప్రచారం



గోపాలపట్నంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి -గోపాలపట్నం : స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ప్రాణ త్యాగానికైనా సిద్ధమని, విశాఖ ఉక్కు పోరాట కమిటీ సభ్యుడు జి.మహేష్ అన్నారు. గురువారం గోపాలపట్నం సిఐటియు కార్యాలయంలో ఉక్కు రక్షణ బైక్‌యాత్ర వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ 32 మంది బలిదానంతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోనీయమని స్పష్టం చేశారు. 958 రోజులుగా రిలేదీక్షలు చేపడుతున్న వారంతా ఉక్కు పరిరక్షణకు ప్రాణత్యాగానికైనా సిద్ధమన్నారు. ఈనెల 29న కూర్మన్నపాలెం జంక్షన్‌లో జరిగే ఉక్కు రక్షణ బహిరంగసభను జయప్రదంచేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం గోపాలపట్నం జోన్ కమిటీ కార్యదర్శి బలివాడ వెంకటరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కుకు సొంత గనుల కేటాయించి, ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.సత్యనారాయణ అనసూయ, ముద్దాడ వరప్రసాద్, ఆర్ శ్రీను పి. నితిన్, ఉక్కు పోరాట సమితి నాయకులు తిరుపతి నాయుడు, శివ, మురళీకృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు

ఆరిలోవ: ఎంతో మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రయివేటు వ్యక్తులకు అమ్మేయాలని చూస్తున్న తరుణంలో ప్రజలే దానిని రక్షించుకోవాలని సిపిఎం నేతలు పిలుపునిచ్చారు. సిపిఎం ఆధ్వర్యంలో చేపడుతున్న ఉక్కురక్షణ ఉత్తరాంధ్ర బైకుయాత్రకు సంఘీభావం తెలుపుతూ,దీన్ని విజయవంతం చేయాలని ఆరిలోవ జోన్‌కమిటీ ఆధ్వర్యంలో గురువారం పలుప్రాంతాల్లో పోస్టర్లతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం ఆరిలోవ జోన్ కార్యదర్శి వి.నరేంద్రకుమార్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా దాదాపు మూడేళ్లుగా కార్మికులు పోరాడుతున్నా కేంద్రం వైఖరిలో మార్పు రాకపోవడం దుర్మార్గమన్నారు. ఈ నెల 29నఉత్తరాంధ్ర బైకు యాత్ర ముగింపు సభకు భారీగా ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జోన్ కార్యవర్గ సభ్యులు పి.శంకరరావు, నేతలు కె.సత్యనారాయణ, వై.అప్పారావు, కె.నాగరాజు, వి.భూలోకరావు, ఎం.లక్ష్మీ, కె.సన్యాసమ్మ పాల్గొన్నారు.

పాయకరావుపేట: విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ బైక్ యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు కోరారు. స్థానిక మెయిన్ రోడ్‌లో గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, ఈ నెల 26న పాయకరావు పేటలో జరిగే విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ బైక్ యాత్ర బహిరంగ సభను జయప్రదం చేయాలనిపిలుపు నిచ్చారు. నాగేశ్వరరావు, రాము, లోవరాజు పాల్గొన్నారు.



నర్సీపట్నంలో పోస్టర్ ఆవిష్కరణలో సిపిఎం నేతలు

నర్సీపట్నం టౌన్ : విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు సిపిఎం తలపెట్టిన ఉక్కు రక్షణ బైకు యుాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక విలేకరులతో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు మాట్లాడుతూ, ఈ నెల 26న స్టీల్ ప్లాంట్ పరిరక్షణ బైక్ యాత్ర నర్సీపట్నం చేరుకుంటుందని తెలిపారు. సీపీఎం సీనియర్ నాయుకులు సాపిరెడ్డి నారాయణమూర్తి మాట్లాడుతూ, తెలుగు ప్రజలు పోరాడి సాదించుకున్న స్టీల్ ప్లాంట్‌ను ప్రజలే కాపాడుకోవాన్నారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ పోరాటానికి విద్యార్థులు, యువజనులు, కార్మికులు, ఉద్యోగులు కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో సత్తిబాబు, రాజు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

12 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -చీడికాడ : మండలంలోని అప్పలరాజు పురం గ్రామంలో వాహన తనిఖీలు నిర్వహి స్తుండగా 12 కేజీల గంజాయితో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై రామారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ముందుగా అందిన సమాచారం మేరకు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా కోణం నుంచి అప్పలరాజు పురంకు పల్సర్‌బైక్‌పై ఇద్దరు వస్తుండగా పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారన్నారు. బైక్ స్కిడ్ కావడంతో వెనుక కూర్చున్న వ్యక్తి బ్యాగ్‌తో కింద పడిపోయాడని, అతడిని అదుపులో తీసుకుని 12 కేజీల గంజాయి, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఏఎస్సై నాగేశ్వరరావు, శ్రీనివాస్, అశోక్ పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సర్వే ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- వేపగుంట : పెందుర్తి పిహెచ్‌సి పరిధిలోని పెదగాడి, పినగాడి, కరకవానిపాలెం గ్రామాలలో నిర్వహిస్తున్న సర్వేను జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ సిహెచ్.పూర్ణేంద్రబాబు గురువారం తనిఖీ చేశారు. సర్వే జరుగుతున్న తీరును నేరుగా ప్రజలకే అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. అన్ని పిహెచ్‌సిల్లో క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యాధి లక్షణాలను వివరిస్తూ, అనుమానం వుంటే వెంటనే పరీక్షలు చేయించుకుని మందులు, వాడాలన్నారు. సూపర్‌వైజర్ వానపల్లి శ్రీనివాసరావు, టిబి హెల్త్ విజిటర్ కె శ్రీనివాస్, హెల్త్ సూపర్వైజర్ ఇషాక్, ఈశ్వర్, పాల్గొన్నారు.

అవంతిలో జాతీయ ఫార్మాకో భద్రతా వారోత్సవాలు

ప్రజాశక్తి - తగరపువలస :స్థానిక అవంతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో గురువారం జాతీయ ఫార్మాకో విజిలెన్స్ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఎయు కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ జి గిరిజాశంకర్ మాట్లాడుతూ ఫార్మాకో విజిలెన్స్ ఉత్సవాల ప్రాధాన్యతను వివరించారు. చిప్పాడ, దివీస్ లేబొరేటరీస్ జనరల్ మేనేజర్ డాక్టర్ ఎం.సత్య నారాయణ,కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంబి రాజు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి ఉమాశంకర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఫార్మశీ విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించారు.

మెకానికల్ కోర్సులతో ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి -ఆనందపురం :మెకానికల్ కోర్సులతోనే డిప్లమా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ అన్నారు. గిడిజాలలోని సాయిగణపతి పాలిటెక్నిక్ లో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల 'కన్వెన్షనల్ మెషినింగ్ ప్రాసెస్' వర్క్‌షాప్‌లో మాట్లాడుతూ భావితరాల భవిష్యత్తు మెకానికల్ రంగంపై ఆధారపడి ఉందని, తయారీ రంగంలో భారత్ ప్రపంచదేశాలతో పోటీ పడుతోందన్నారు. సాంకేతిక రంగంలో పలు మార్పులను వివరించి, విద్యార్థులకు సూచనలు చేశారు.కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎస్ వేణుగోపాల్, డిప్లమో ప్రిన్సిపల్ ఎల్ మహేశ్వరరావు, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రదీప్ వర్మ, అకడమిక్ ఇన్‌ఛార్జి కెవిఎస్ అమరేంద్ర కుమార్, మెకానికల్ హెచ్‌ఒడి రాజేంద్రప్రసాద్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

శారీరక ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి -పిఎం పాలెం : .కొమ్మాది జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థినులకు శారీరక ఆరోగ్యం, నెలసరి సమస్యలు, యోగా, సుదర్శన క్రియలపై అవగాహనకు మూడు రోజుల శిక్షణ శిబిరాన్ని నిర్వహించినట్టు ప్రిన్సిపల్ కె.సంజయ్ తెలిపారు.ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ హ్యూమన్ వాల్యూస్ సంస్థ ఆధ్వర్యంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్‌లో భాగంగా, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో ఈ శిక్షణనిచ్చారు. సీనియర్ టీచర్ టి.అరుణకుమారి విద్యార్థినులకుయోగ,సుదర్శన క్రియలను నేర్పించారు. కార్యక్రమంలో సహాయకురాలు సరస్వతి, నవోదయ విద్యాలయ స్టాఫ్‌నర్స్ పి.గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ కీర్తి అరుణకుమారి పాల్గొన్నారు. చివరి రోజు విద్యార్థినులకు ఉచితంగా కిట్ అందించారు.

అధిక దిగుబడుల సాధనపై కొబ్బరి రైతులకు అవగాహన

ప్రజాశక్తి- తగరపువలస : భీమిలి మండలం అన్నవరం గ్రామంలో ఉద్యాన శాఖ, కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో, కేంద్రీయ కొబ్బరి అభివృద్ధి బోర్డు ఆధ్వర్యంలో గురువారం కొబ్బరి రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కొబ్బరి పంటలో అధిక దిగుబడులు సాధన, కొబ్బరి అభివృద్ధి బోర్డు అందిస్తున్న ప్రోత్సాహకాలపై ఉద్యానశాఖ జిల్లా అధికారి కె మన్మధరావు వివరించారు. శాస్త్రవేత్త సత్తిబాబు, ఉద్యాన శాఖ భీమిలి డివిజన్ అధికారి పూసర్ల స్వాతి, ఫీల్డ్ ఆఫీసర్ ఎం కిరణ్‌కుమార్, హార్టికల్చర్ అసిస్టెంట్ భువన ప్రత్యూష, వి గోపి రాజు, పలువురు రైతులు పాల్గొన్నారు

చంద్రబాబు అరెస్ట్‌పై విపక్షాల తప్పుడు ప్రచారం

వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ సుబ్బారెడ్డి

ప్రజాశక్తి- సీతమ్మధార : వైసిపి ప్రభుత్వం కక్షపూరితంగా చంద్రబాబును అరెస్ట్ చేసిందని విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి మండిపడ్డారు. గురువార స్థానిక షాదీఖానాలో ఉత్తర నియోజకవర్గం 26,42,43,44 వార్డుల సమీక్ష సమావేశాన్ని నియోజకవర్గ సమన్వయకర్త, కెకె.రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భ సుబ్బారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు తప్పు చేశారు కాబట్టే కోర్టు జైలుకు పంపిందన్నారు.వైసిపి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌ను ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలోరాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాధం, వైసిపి సీనియర్ నేత బొడ్డేటి కాశీ విశ్వనాథం, ఉత్తరాంధ్ర జెఎసి కన్వీనర్ లజపతిరాయ్, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్లు బాణాల శ్రీనివాసరావు, అల్లు శంకరరావు, కంటిపాము కామేశ్వరి, కె..అనిల్‌కుమార్ రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతిశ్రీనివాస్, పి.ఉషశ్రీ, బర్కత్ అలీ, కెవిఎన్.శశికళ, రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత, దామా సుబ్బారావు, ఫారుఖీ, వార్డు అధ్యక్షులు పీలా వెంకటలక్ష్మీ, నీలి రవి, పాల్గొన్నారు.



సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న కెకె.రాజు, ఇతర వైసిపి నేతలు

దసరా తర్వాత విశాఖ నుంచే పాలన

దసరా నుండి విశాఖలోనే పరిపాలన సాగిస్తామని, పరిపాలనారాజధానికి విశాఖ అన్ని విధాల అనుకూలమని వైవి.సుబ్బారెడ్డి అన్నారు. ఉత్తర నియోజకవర్గ కార్యాలయం పక్కనే ఏర్పాటుచేసిన విజయ గణపతి నవరాత్రి ఉత్సవ మండపాన్ని కెకె.రాజు ఆహ్వానం మేరకు సందర్శించి, పూజలు చేశారు. కార్యక్రమంలో వికెపిసిపిఐఆర్ చైర్మన్ చొక్కాకుల లక్ష్మీవెంకటరావు, ఇతర నేతలు ఉన్నారు.

సిసి రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆరిలోవ : 11వ వార్డు పరిధి పాత ఆరిలోవ ప్రాంతంలో జివిఎంసి నిధులు రూ.22లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్లు, కాలువల పనులకు గురువారం నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని అన్నివార్డుల్లో పూర్తి స్థాయింలో మౌలిక వసతులను కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నేత గొలగాని శ్రీనివాసరావు, జివిఎంసి అధికారులు పాల్గొన్నారు.

రూ.47లక్షలతో సామాజిక భవన నిర్మాణం

ప్రజాశక్తి -ములగాడ: జివిఎంసి 60వ వార్డు ఎంఐజి కాలనీలో సామాజిక భవన నిర్మాణానికి కార్పొరేటర్ డాక్టర్ పివి.సురేష్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివాహాది శుభకార్యక్రమాలు, ఇతర వేడుకల నిర్వహణకు రూ.20లక్షల ఎంపీ కోటా నిధులు, రూ.47 లక్షల జివిఎంసి నిధులతో ఈ సామాజిక భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. వార్డు అభివృద్ధికి సహకరిస్తున్న మేయర్, ఎంపీలకు ధన్యవాదాలు తెలిపారు.

ఉచిత దంత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక జివిఎంసి ఉన్నత పాఠశాలలో గురువారం సంగివలస అనిల్ నీరుకొండ దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఉచిత దంతవైద్యశిబిరం నిర్వహించారు. డెంటిస్ట్‌లు డాక్టర్ చాందిని, హంసిత, దివ్య బాల, బేగం పాల్గొని 160 మంది విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు చేశారు కార్యక్రమంలో హెచ్‌ఎం సిహెచ్ సింహాచలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

విద్యార్థులకు టీ షర్టుల పంపిణీ

ప్రజాశక్తి -ఆనందపురం: మండస్థాయి ఖోఖో, కబడ్డీ, రన్నింగ్ ఆటల పోటీల్లో విజయం సాధించి, విశాఖ జోన్ స్థాయి పోటీలకు అర్హత సాధించిన శొంఠ్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి కోరుకొండ మూర్తి టీ షర్ట్స్ ఇచ్చి అభినందించారు. గతంలో కూడా అండర్-16 త్రో బాల్ జట్టుకు కూడా మూర్తి టీ షర్టులు అందించి అభినందించారు.కార్యక్రమంలో హెచ్‌ఎం జోగారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

వైఎస్ఆర్ బీమా తక్షణసాయం అందజేత

ప్రజాశక్తి-ములగాడ :జివిఎంసి 60వ వార్డు బర్మాకాలనీలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బండారు శివ తులసికుమార్ కుటుంబాన్ని వార్డు కార్పొరేటర్ పివి సురేష్ పరామర్శించారు. వైఎస్ఆర్ బీమా కింద తక్షణ సాయంగా మంజూరైన రూ.పది వేలను బాధిత కుటుంబానికి అందజేశారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి -గాజువాక: జివిఎంసి 76వ వార్డు విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకల్లో నిర్వహించిన భారీ అన్నసమారాధనను వైసిపి సోషల్ మీడియా జిల్లా కన్వీనర్, కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐదు వేలమంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.కార్యక్రమంలో కాశీవిశ్వేశ్వరరావు, మంత్రి శంకరనారాయణ, చెల్లూరి ఈశ్వరరావు, ముదుర్తి శ్రీరామమూర్తి, చెల్లూరి సతీష్, కణితి అప్పలరాజు, డాక్టర్ సుజిత్‌కుమార్, సరోజిని, భవాని, దేవి, భాగ్య పాల్గొన్నారు

క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ పాఠశాల క్రీడా మైదానంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. రెండ్రోజుల పాటు జరుగనున్న ఈ పోటీల్లో విశాఖ రూరల్, భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల నుంచి 530 మంది విద్యార్థినిలు పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, బ్యాడ్మింటన్, టెన్నీకాయిట్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రమణ, మాజీ కౌన్సిలర్ ఎం.లక్ష్మణరావు, ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

అప్పన్నను దర్శించిన విజయబాబు

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్న ఆంధ్రప్రదేశ్ అధికార భాష సంఘం చైర్మన్ పి విజయబాబు దంపతులు గురువారం దర్శించుకున్నారు.ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

యుటిఎఫ్ సభ్యత్వ నమోదు



స్వర్ణోత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి-పెందుర్తి : మండలంలో పలు ఉన్నత పాఠశాలల్లో జిల్లా ప్రధానకార్యదర్శి టిఆర్.అంబేద్కర్ ఆధ్వర్యంలో యుటిఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు. రాంపురం ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేయాలన్నదే యుటిఎఫ్ డిమాండ్ అని, దీనికి జిపిఎస్ ఎంతమాత్రం ప్రత్యామ్నాయం కాదన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలని, జిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తూ ఒపిఎస్ అమలు చేయాలని 23న విశాఖజిల్లాలోకి ప్రవేశించే బైక్‌జాతాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ఎస్ నాగమణి, జిల్లా సహాధ్యక్షురాలు పొంగలి ఉమ, జిల్లా కార్యదర్శి చుక్క సత్యం, పెందుర్తి మండల ప్రధాన కార్యదర్శి అప్పలరాము పాల్గొన్నారు

పరదేశమ్మ పోరాటం మరువలేనిది



పరదేశమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాంబాబు

ప్రజాశక్తి -గాజువాక: దశమకొండ ఇళ్ల స్థలాల పోరాటంలో పరదేశమ్మ చేసిన పోరాటం మరువలేనిదని సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం రాంబాబు అన్నారు. సిపిఎం సానుభూతిపరురాలు పరదేశమ్మ ప్రథమ వర్ధంతి సభను దశమకొండ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ముందుగా పరదేశమ్మ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ ప్రాంత బడుగు బలహీన వర్గాల కోసం పరదేశమ్మ చేసిన పోరాటాలను స్మరించుకుని కొనియాడారు. చివరివరకు నమ్మిన సిద్ధాంతం కోసం సిపిఎంలోనే కొనసాగారన్నారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు నర్సింగరావు, ఎం శ్రీదేవి, లక్ష్మి, జె.కోటేశ్వరరావు, శ్రీలక్ష్మి, సంతోషం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -మధురవాడ: మారికవలస ఫీడర్‌లో మరమ్మతులు, నిర్వహణ పనుల దృష్ట్యా ఈనెల22న శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మూడోజోన్ డిఇఇ పి.శ్రీనివాసరావు తెలిపారు. జెఎన్ఎన్‌యుఆర్ఎం, మారికివలస ఫీడర్‌లోని పిపి2 కాలనీ, మారికవలస పెట్రోల్ బంక్ ఏరియా, శారదానగర్ కాలనీ, తిమ్మాపురం రోడ్, ఓంకాన్ అపార్టుమెంట్, వైఎస్ఆర్ కాలనీ, గాయత్రీ విద్య హాస్పిటల్, కార్పెంటర్స్ కాలనీ, వికలాంగుల కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గుర్తించి సహకరించాలని కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన




శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ కొండబాబు

ప్రజాశక్తి- భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు చేపల దిబ్బడిపాలెంలో రూ.24 లక్షల జివిఎంసి నిధులతో నిర్మించనున్న సిమెంట్ కాల్వల పనులకు వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు గురువారం శంకుస్థాపన చేశారు. సచివాలయ అధికారులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

నిర్వాసితుల గోడు పట్టదా..!

- త్యాగాలకు ప్రైవేటీకరణ నజరానా దారుణం
- సమస్యల్ని పరిష్కరించకుండా ముందుకెళితే ఒప్పుకోం
- కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాల్సిందే
- సాధించిన స్ఫూర్తితోనే పోరాడి పరిరక్షించుకుంటాం
- స్పష్టం చేసిన నిర్వాసితులు, కార్మికులు, స్థానికులు



ఉక్కు నిర్వాసిత దీక్షల్లో పాల్గొన్న సిపిఎం ముఖ్యనేత బివి.రాఘవులు (ఫైల్‌ఫొటో)

'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు'అంటూ ముక్తకంఠంతో నినదించి, ఎన్నో త్యాగాలు, ఆందోళనలు.. బలిదానాలతో సాధించుకున్న ఆధునిక దేవాలయం విశాఖ ఉక్కు కర్మాగారం. అడిగిందే తడవుగా 64 గ్రామాల ప్రజలు భూమిల్ని అప్పగించారు. తమ భూముల్లో ఏర్పాటయ్యే ఫ్యాక్టరీతో ఎందరికో ఉపాధి లభిస్తుందనీ, తమకూ ప్రయోజనం చేకూరుతుందని నమ్మారు. దశాబ్దాలుగా నిర్వాసితులుగా మిగిలిపోయినా, ఇచ్చిన హామీలు నెరవేరకపోతాయా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటుకు ధారదత్తం చేస్తామన్న కేంద్ర ప్రభుత్వ ప్రకటనతో తమ పరిస్థితి ఏంటని నిర్వాసితులు ఆవేదన,ఆందోళన చెందుతున్నారు..

ప్రజాశక్తి- ఉక్కునగరం: రాష్ట్రానికే తలమానికమైన విశాఖ ఉక్కును ప్రైవేటీకరించడం ఖాయమని కేంద్ర ప్రభుత్వం కుండబద్దలుగొట్టి చెబుతున్నా, జగన్ సారథ్యంలోని వైసిపి ప్రభుత్వం మాత్రం చేష్టలుడిగి చూస్తోంది. కర్మాగారానికి, నిర్వాసితులకు కనీస న్యాయం చేస్తామన్న విషయంపై ఇసుమంతైనా శ్రద్ధ చూపడం లేదు. స్టీల్‌ప్లాంట్ ఆస్తులు అమ్ముతున్నా,కళ్లూ చెవులూ మూసుకుంది. కార్మికులతోపాటు నిర్వాసితులు, ఈ ప్రాంత ప్రజలు స్టీల్‌ప్లాంట్‌ప్రైవేటీకరణను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, ఆందోళన చేస్తున్నా, తమ నిర్ణయంలో ఎటువంటి మార్పులేదని, ప్రైవేటీకరణ ఖాయమని స్పష్టం చేసిన కేంద్ర ప్రభుత్వం, తాజాగా ప్లాంటు ఆస్తుల అమ్మకానికి పచ్చజెండా ఊపింది. ఈ వ్యవహారంపైనా నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మూడో తరం వచ్చినా నిర్వాసితులకూ అందని పరిహారం

ఉక్కు కర్మాగారానికి భూములు త్యాగం చేసిన నిర్వాసితుల కుటుంబాల్లో.. మూడో తరం వచ్చినా నేటికి పరిహారం చేతికందలేదు. ప్లాంటు కోసం నెల్లిముక్కు, సిద్దేశ్వరం, నడుపూరు, గంగవరం, దిబ్బపాలెం, కణితి, అప్పికొండ, వడ్లపూడి, కొండయ్యవలస పంచాయతీల పరిధిలోని 64 గ్రామాల్లో 22 వేల ఎకరాల భూమి సేకరించారు. నిర్వాసితుల ఆందోళనలతో మెరకకు రూ.17 వేలు, పల్లం పొలాలకు రూ.20వేల చొప్పున పరిహారం ప్రకటించారు.ఈ పరిహారాన్ని లోక్‌అదాలత్ సమక్షంలో అందజేయగా.. కొందరు రైతులు మళ్లీ న్యాయ స్థానాన్ని ఆశ్రయించారు. ఇలా 12,680 ఎకరాల పరిహారం రూ.17.08 కోట్లు అలాగే ఉండిపోయింది. గ్రామ సభలు పెట్టి రైతుల వారసులు, యాజమాన్య హక్కు ఉన్న వారికి పరిహారం ఇవ్వాలని 2021 మార్చి 20న న్యాయ స్థానం ఆదేశించినా ఆ ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

అరకొరగానే నిర్వాసితులకు ఉద్యోగాలు

ఉద్యోగ నియామకాల్లో నిర్వాసితులకు 50 శాతం కోటా ఇవ్వాలన్న కేంద్రం ఉత్తర్వుల అమలు స్టీల్‌ప్లాంటులో మొక్కుబడిగా జరుగుతోంది. నిర్వాసితులకు 'ఆర్-కార్డు మంజూరు చేసి.. ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న హామీ అమలు కావడం లేదు. స్టీలుప్లాంటు సబ్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజిలో 15,475 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా.. 8,009 మందికి మాత్రమే ఉద్యోగాలు కల్పించారు.మరో 7,466 మంది ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్నారు. వీరిలో చాలా మంది వయసు పైబడటంతో ఆర్-కార్డులను వారసులు పేరున మార్చినా ఉద్యోగాలు అందలేదు. ఉద్యోగం రాక, కోల్పోయిన సంపాదనను నష్ట పరిహారంగా అందించాలని, ఉద్యోగం రాని ఆర్‌కార్డు దారులందరికీ న్యాయం చేయాలని ఉక్కు నిర్వాసితుల సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగానికి ఎదురుచూపులే మిగిలాయి



స్టీల్ ప్లాంట్ లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాను. 2007 నుంచి నిర్వాసిత కోటాలో స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. మరో నాలుగేళ్లు దాటితే ఉద్యోగ అర్హత వయసు దాటిపోతుంది. ఈలోగానైనా ఉద్యోగం వస్తున్న ఆశను ప్రైవేటీకరణ చిచ్చుతో అందకుండా పోయేలా ఉంది. ఉద్యోగాల కోసం పోరాటాలుచేసి, జైలుకెళ్లిన మాకు అడియాసలే మిగిలాయి.

-చట్టి నర్సింగరావు
నిర్వాసిత కాంట్రాక్ట్ కార్మికుడు, ఆగనంపూడి

యువ కార్మికులంతా ఉద్యమిస్తాం



కష్టపడి స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం సంపాదించినప్పటికీ, ప్రైవేటీకరణ నిర్ణయంతో లోలోపల భయంగానే ఉంది. ప్రైవేటీకరణ జరిగితే ఆశించిన జీవితాన్ని కోల్పోయినట్టే. యువకార్మికులుగా స్టీల్‌ప్లాంట్ అభివృద్ధిలో భాగస్వాములవ్వడంతోపాటు, బతుకును తీర్చిదిద్దుకుందామన్న ఆశలకు కేంద్రప్రభుత్వం గండికొడుతోంది. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకుంటే యువకార్మికులంతా ఉద్యమిస్తాం..

ఉరిటి మరిడయ్య, అగనంపూడి

మతి మరుపు వ్యాధితో జర జాగ్రత్త



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ ఎన్ఎన్.రాజు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ఆరు పదులు దాటిన వృద్ధులలో ఎనిమిది శాతం మందికి వచ్చే మతిమరుపు వ్యాధి అత్యంత క్లిష్టమైనదని ప్రభుత్వ మానసిక ఆసుపత్రి పూర్వ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్ఎన్. రాజు అన్నారు. ప్రపంచ అల్జీమర్స్‌డే సందర్భంగా కౌసల్య కౌన్సిలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ, జ్ఞాపకశక్తి మెదడులో ఏ విధంగా నిక్షిప్తమౌతుందో, అది క్షీణించి మతిమరపు ఎలా వస్తుందో వివరించారు. వయసు మీరిన స్త్రీలలో మతిమరపు వ్యాధి అధికంగా ఉంటుంద న్నారు. మొదట్లో చిన్న విషయాలు మరిచిపోవడం, తీవ్రమైన తరువాత వ్యక్తులు తమ దైనందిన చర్యలను నిర్వహించుకోవడం క్లిష్టమవుతుందన్నారు.

ప్రవర్తనలో మార్పులు, అనిశ్చిత భావోద్వేగాలు, భ్రమలతో భయ కంపితులు కావడం వంటి సాధారణ లక్షణాలతోపాటు. కుటుంబ సభ్యులను గుర్తించలేకపోవడం, వచ్చిపోయే దారులు మరిచిపోవడం, బట్టలు వేసుకోవడం కూడా మరిచిపోవడం ద్వారా వ్యాధి లక్షణాలు తీవ్రమౌతాయన్నారు. సరైన సమయంలో వ్యాధిని గుర్తిస్తే, నిపుణుల సలహాతో కొంత నివారించవచ్చని, దీనికి కుటుంబసభ్యుల సహకారం ఎంతో అవసరమన్నారు. చక్కని నిద్ర, పోషకాలతో నిండిన ఆహారం, ప్రణాళికాబద్ధమైన దినచర్య, తేలికపాటి వ్యాయామం ఈ వ్యాధిని అరికట్టడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమానికి మానసిక వైద్యులు డాక్టర్ నిహాల్ సమన్వయ కర్తగా వ్యవహరించారు.

కృష్ణయ్య మరణం సాహితీ లోకానికి తీరనిలోటు

ప్రజాశక్తి- సీతమ్మధార : సుదీర్ఘకాలం పాటు విశాఖ సాహితితో అనుబంధం కలిగి, సంస్థ అభివృద్ధికి ఎంతో శ్రమించిన ఆచార్య పివి. కృష్ణయ్య మరణం సాహితీలోకానికి తీరని లోటని విశాఖ సాహితి అధ్యక్షురాలు ఆచార్య కోలవెన్ను మలయవాసిని, కార్యదర్శి శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తిరీత్యా పివి.కృష్ణయ్య గణితశాస్త్ర నిపుణులు అయినప్పటికీ, తెలుగు భాష, సాహిత్యం పట్ల ఎనలేని అభిమానం ఉన్న వ్యక్తి కావడంతో విశాఖ సాహితి సంస్థ అభివృద్ధికి సంస్థ గౌరవాధ్యక్షుడిగా సలహాలు, సూచనలందిస్తూ ఎంతో కృషి చేశారన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

- యుటిఎఫ్ గాజువాక ప్రధాన కార్యదర్శి నూకరాజు

ప్రజాశక్తి- గాజువాక : ప్రతిపక్ష నేతగా పాదయాత్రలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ మేరకు తక్షణమే కాంట్రిబ్యూషన్ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని యుటిఎఫ్ గాజువాక ప్రధాన కార్యదర్శి సబ్బారపు నూకరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం విలేకర్లతో మాట్లాడుతూ, ప్రభుత్వం కేబినేట్ సమావేశంలో సిపియస్‌ను రద్దు చేస్తూ జిపియస్‌కు ఆమోదముద్ర వేయడం దారుణన్నారు. జిపిఎస్ ఎట్టిపరిస్థితుల్లోనూ ఆమోద యోగ్యం కాదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులంతా వ్యతిరేకిస్తున్న సిపిఎస్ రద్దుచేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు.

డిఎంహెచ్ఒ కార్యాలయంలో

జగనన్న సురక్ష వైద్యశిబిరాల కంట్రోల్ బోర్డు

ప్రజాశక్తి-సీతమ్మధార : జిల్లాలో ఈ నెల 30 నుంచి నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలకు సంబంధించి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారికార్యాలయంలో కంట్రోల్ బోర్డు ఏర్పాటు చేసినట్లు డిఎంహెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. వైద్య శిబిరాలు, సాంకేతికపరమైన సలహాలు, సూచనలు కోసం నారాయణరావు (ఎంపిహెచ్ఇఒ) 9247423800, మూర్తి (ఎంపిహెచ్ఎ) 89851 81874, సోమేశ్ (ఎంపిహెచ్ఎ) 9110394476 ఫోన్‌నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభం

ప్రజాశక్తి - యలమంచిలి

స్థానిక కొత్తపేట ప్రభుత్వ హైస్కూల్లో అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి స్కూలు గేమ్స్ గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు బాలికల విభాగంలోని కబడ్డీ పోటీలను ఎంపిపి బోదెపు గోవిందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనబరచిన స్త్రీలు దేశానికి గొప్ప పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టారని తెలిపారు. అనంతరం బాలికల కబడ్డీ, త్రోబాల్ ఆటలను తిలకించారు. ఇక్కడ జరిగిన స్కూలు గేమ్స్ తొలిరోజు మునగపాక, అచ్యుతాపురం, రాంబిల్లి, యలమంచిలి మండలాలకు చెందిన విద్యార్థినులు పాల్గొన్నట్లు ఆర్గనైజింగ్ సెక్రెటరీ సి హెచ్.వెంకటరావు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వైవి.రమణ, షబ్బీర్, సురేష్, సూర్యప్రభ, శారద, రాజు , వంశీ, మూర్తి పాల్గొన్నారు.

అనకాపల్లి : మండలంలోని కూండ్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నియోజకవర్గ స్థాయి అండర్ 14, 17 విభాగాల్లో స్కూల్ గేమ్స్‌ను ఎంపిపి గొర్లి సూరిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి గేమ్స్ వల్ల పిల్లల్లో మానసిక ఉల్లాసం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సేనాపతి పెంటారావు, నక్కరాజు ప్రభాకర్, ఉపాధ్యాయులు, పిటిలు, విద్యార్థులు పాల్గొన్నారు.



యలమంచిలిలో కబడ్డీ ఆడుతున్న బాలికలు



భూమి పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపిపి సూరిబాబు

భూమి పాస్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి- అనకాపల్లి

వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కార్యక్రమంలో భాగంగా రీ సర్వే చేసిన భూములకు పాస్ పుస్తకాలను మండలంలోని గోపాలపురం గ్రామ సచివాలయంలో గురువారం పంపిణీ చేశారు. ఎంపిపి గొర్లి సూరిబాబు చేతుల మీదుగా 380 మంది రైతులకు పాస్ పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ జెర్రిపోతుల లక్ష్మి, వార్డు మెంబర్లు, రైతులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని ములకలాపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే పూర్తయిన 764 మందికి నూతన పట్టాదార్ పాస్ పుస్తకాలను ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జిల్లా పరిషత్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్లె అనురాధ, జెడ్పిటిసి కర్రి సత్యం, వైసిపి మండల అధ్యక్షుడు బూరె బాబురావు గురువారం పంపిణీ చేశారు. గ్రామంలో 1800 మందికి పట్టాదార్ పాస్ పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గొర్లె రామ కొండలరావు, మజ్జి రాజు, మజ్జి అప్పల సత్యం, కర్రి సాంబ, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ఉచిత వైద్య శిబిరాలకు స్పందన

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని బోయిలకింతాడ గ్రామంలో గురువారం ఉచితంగా నిర్వహించిన కంటి, సాధారణ వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. ఆ గ్రామ సర్పంచ్ బూరె బాబురావు ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన కంటి, మెడికవర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో సాధారణ వైద్య శిబిరాలు నిర్వహించారు. వీటిని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జిల్లా పరిషత్ స్త్రీ శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్లె అనురాధ, జెడ్పిటిసి కర్రి సత్యం ప్రారంభించారు. 87 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా, 39 మందికి కంటి శస్త్ర చికిత్సకు కోసం ఎంపిక చేశారు. వీరికి వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తారు. మెడికవర్ హాస్పిటల్ వారు నిర్వహించిన మెడికల్ క్యాంపులో 110 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో కొంతమంది రోగులను శస్త్ర చికిత్సకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆనం సాంబమూర్తి, రాము, బొబ్బిలి రాము, దాసరి వెంకటరమణ, వాలంటీర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు అవంతిలో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-చోడవరం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, మాకవరపాలెం అవంతి ఇనిస్టిట్యూట్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యాన మాకవరపాలెం అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 22న శుక్రవారం 15 కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తునట్టు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి టి.చాముండేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఇంటర్వ్యూలకు ఎస్ఎస్‌సి నుండి పిజి వరకు చదువుకొని, 18 నుండి 40 సంవత్సరాల లోపు యువతీ, యువకులు అందరూ పాల్గొనవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు 9494791935, 8309561123 నెంబర్లకు సంప్రదించాలని ఆయన కోరారు.

అంగన్వాడీ కేంద్రాలకు గేట్లు వితరణ

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని మల్లునాయుడు పాలెంలోని అంగన్వాడీ-1, అంగన్వాడీ-2 కేంద్రాలకు మాజీ సర్పంచ్, విశాఖ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చిటికిరెడ్డి దేముడు 4వ వర్ధంతి సందర్భంగా దేముడు తనయుడు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చిటికి రెడ్డి వినోద్‌కుమార్ ఐరన్ రక్షణ గేట్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లోంచి చిన్నారులు బయటికి రాకుండా గేట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు వి సుభాషిణి, ఎస్.అక్కమ్మ, జి.నాగమణి, జి.రేవతి, చుక్క ప్రసాద్ పాల్గొన్నారు.



గేట్లు అందజేస్తున్న వినోద్‌కుమార్

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపిక



విజేతలతో వైసిపి నేత బుల్లిబాబు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-కశింకోట

కశింకోట జిల్లా పరిషత్తు బాలుర హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారు. రోలుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన 67వ ఎస్‌జిఎఫ్ ఉమ్మడి జిల్లాల జూడో పోటీలలో కశింకోట డిపిఎన్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. అండర్ 14 విభాగంలో వై.కోటేశ్వరరావు, కె.లక్ష్మణరావు బంగారు పతకం, బి.రోహిత్ రజిత పతకం, అండర్ 17 విభాగంలో ఎం.అఖిల్ స్వర్ణపతకం సాధించారు. వీరు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎమ్ఆర్‌వి అప్పారావు, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రభాకరరావు తెలిపారు. వీరిని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మళ్ళ బుల్లిబాబు, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మెన్ కె.సుజాత, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

వడ్డాది : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జూడో అండర్ 14, 17 విభాగాల్లో వడ్డాది శ్రీకోవెల అప్పన్నదొర జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈనెల 20న రోలుగుంటలో జరిగిన జిల్లా స్థాయి జూడో పోటీల్లో 59 కేజీల విభాగంలో ఏ ధనుశ్రీ ప్రథమ స్థానం సాధించింది. 56 కేజీల విభాగంలో కె మణికంఠ, 40 కేజీల విభాగంలో సత్య దీక్ష, 25 కేజీల విభాగంలో కే సింహాద్రి ప్రతిభ కనబరిచారు. గెలుపొందిన విద్యార్థులు వచ్చే నెలలో జరగబోయే రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయులు పివి శేషుబాబు తెలిపారు. విజేతలను ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఆర్ వెంకట్రావు, పిడి డి.నర్సింగరావు, ఉపాధ్యాయులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

సూక్ష్మ సాగు వైపు రైతులను ప్రోత్సహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి- అనకాపల్లి

జిల్లాలో మరింత ఎక్కువగా సూక్ష్మ సాగు (మైక్రో ఇరిగేషన్) చేపట్టేలా రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అధికారులను కోరారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూక్ష్మ సాగు చేయడం ద్వారా వచ్చే లాభాలను గూర్చి అందరికీ అవగాహన కలిగించాలన్నారు. ఉద్యానవన సాగులో పామాయిల్, కూరగాయలు, ఆకుకూరలు సాగు చేసినట్లయితే తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి వస్తుందన్నారు. సూక్ష్మ సాగుకు ప్రభుత్వం కల్పించే రాయితీలను గూర్చి అవగాహన కల్పించాలన్నారు. జిల్లా సూక్ష్మ సాగు అధికారి జివి.లక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో ఈ సంవత్సరం 1500 హెక్టార్లకు మించి సూక్ష్మ సాగు చేయించే లక్ష్యంతో ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. 5 ఎకరాల కన్నా తక్కువ భూమి గల వ్యక్తులకు 90శాతం, 5 ఎకరాల నుంచి 12.5 ఎకరాల మధ్యగల వారికి 50 శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 1618 మంది రైతులకు చెందిన 1673.54 హెక్టార్ల భూమిని సూక్ష్మ సాగుకు రిజిస్టర్ చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లాలోని ఎంఐఏఓలు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అక్టోబర్ 17 నాటికి ఓటర్ల ముసాయిదా జాబితా

ప్రజాశక్తి-అనకాపల్లి

అక్టోబర్ 17వ తేదీ నాటికి ఓటర్ల జాబితా ముసాయిదా ప్రతి ప్రచురిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్ శెట్టి తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన రాజకీయ పార్టీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు అక్టోబర్ 17 నుంచి నవంబరు నెలాఖరు వరకు స్వీకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. శని, ఆదివారాలైన అక్టోబర్ 28, 29, నవంబర్ 18, 19 తేదీలలో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు చెప్పారు. బూత్ స్థాయి ఏజెంట్లను నియమించని పోలింగ్ స్టేషన్లకు రాజకీయ పార్టీలు వెంటనే బీఎల్ఈలను నియమించాలన్నారు. శనివారం ఈవీఎమ్, ఇతర సంబంధిత సామాగ్రి భద్రపరిచే గోదామును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి రాజకీయ పార్టీల ప్రతినిధులు బి.శ్రీనివాసరావు (టిడిపి), కే.హరినాధ బాబు (ఆప్), జి.శ్రీరామ్ (సిపిఎం), ఎస్‌వివి.రామచంద్రరావు (బిఎస్‌పి), ఎన్నికల సూపరింటెండెంట్ లక్ష్మీదేవి, డిటి రవికుమార్ పాల్గొన్నారు.

వికలాంగుల శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- కశింకోట : ఈనెల 26 నుండి 29 వరకు అనకాపల్లి జిల్లాలో జరుగు వికలాంగుల శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల వికలాంగుల సమన్వయకర్త వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో వికలాంగుల సంబంధించి వినికిడి పరికరాలు, మూడు చక్రాల సైకిళ్ళు, ఇతర పరికరాలను అర్హత గలవారికి ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ నెల 26 అనకాపల్లి ఎఎమ్ఏఎల్ కాలేజీలో, 27న చోడవరం హైస్కూల్‌లో, 28న యలమంచిలి డిగ్రీ కళాశాలలో, 29న నర్సీపట్నం బొడ్డేపల్లి రెసిడెన్షియల్ కాలేజీలో ఈ శిబిరాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ శిబిరం వద్ద ఉదయం 10 గంటలు నుండి సాయంత్రం 5 వరకు ఉంటుందని తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి- సబ్బవరం : మండల కేంద్రం సబ్బవరం-2 సెక్షన్ పరిధిలోని 33/11కెవి అంతకపల్లి, సబ్ స్టేషన్-11కెవి గుల్లేపల్లి రూరల్ ఫీడర్ల మరమ్మతులు కారణంగా ఈ నెల 22న శుక్రవారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తునట్లు విద్యుత్ శాఖ ఇఇ ఎస్.రామకృష్ణ తెలిపారు. అంతకాపల్లి సబ్ స్టేషన్ గుల్లేపల్లి రూరల్ ఫీడర్ పరిధిలోని మొగలిపురం, మల్లునాయుడుపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రామకృష్ణ పేర్కొన్నారు ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే

ప్రజాశక్తి- మునగపాక రూరల్: మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆ గ్రామ సర్పంచ్ నూకరాజు వైద్య సిబ్బందితో కలిసి గురువారం ఇంటింటి సర్వే నిర్వహించారు. వైద్య పరీక్షలు జరిపి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ వైద్య రంగానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పెద్దపీట వేయడం ద్వారా వైద్యం ప్రజలకు మరింత చేరువైందని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇంటింటి సర్వేలో పాల్గొన్న సర్పంచ్ నూకరాజు

జిపిఎస్ అమలు సరికాదు : యుటిఎఫ్

ప్రజాశక్తి-అనకాపల్లి

జిపిఎస్ విధానాన్ని ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నా బలవంతంగా ప్రభుత్వం అమలు చేయాలని చూడడం సరికాదని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. పెన్షన్ అంటే ఉద్యోగికి రిటైర్మెంట్ తరువాత ప్రభుత్వం చెల్లించే భరణం, లేదా జీవన భతి అని పేర్కొన్నారు. ఉద్యోగి నుండి చందా వసూలు చేసి, పెన్షన్ ఇస్తామని ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. రిటైర్మెంట్ తరువాత 50 శాతం పెన్షన్ కావాలంటే, ఉద్యోగి తన పిఆర్ఎఎన్ అకౌంట్‌లో అప్పటివరకు దాచుకున్న మొత్తం డబ్బును ప్రభుత్వానికి ఇచ్చేయాలన్నారు. డిఎలు, పిఆర్‌సిలు వర్తించని జిపిఎస్ విధానం వద్దని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి జిపిఎస్‌పై అంతగా ఆసక్తి ఉంటే తమ ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు అమలు చేయాలని సూచించారు.

అభివృద్ధితోనే సమాధానం

ప్రజాశక్తి -అనకాపల్లి : ప్రతిపక్షాల మాటలను పట్టించుకోకుండా అనకాపల్లి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడం ద్వారానే సమాధానం చెప్పడానికి మంత్రి గుడివాడ అమర్నాథ్ కృషి చేస్తున్నారని వైసిపి అనకాపల్లి పట్టణ శాఖ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు పేర్కొన్నారు. స్థానిక రింగ్ రోడ్‌లోని వైసిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అనకాపల్లి పట్టణంలో రూ.20 కోట్లతో రహదారుల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్, ఫుట్ పాతులపై పాదచారులు నడవడానికి వీలుగా పలకలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రూ.2 కోట్లతో హిందూ స్మశాన వాటిక అభివృద్ధి, జిల్లా ఆసుపత్రిలో మరో 50 పడకలు పెంచడం, లారస్ సంస్థ ఆర్థిక సాయంతో ప్రత్యేక బర్నింగ్ వార్డు ఏర్పాటు, పలు కళ్యాణ మండపాల నిర్మాణం చేస్తున్నట్లు వెల్లడించారు. పది కోట్లతో నూకాంబిక ఆలయం ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయన్నారు. కోడూరు గ్రామంలో ఎమ్మెస్ఎంఈ ఆటోనగర్ ఏర్పాటు, స్టేషన్ రోడ్డు విస్తరణ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కొణతాల మురళీకృష్ణ, జాజుల రమేష్, బొడ్డేడ శివ, ఆళ్ల నాగేశ్వరరావు, సకల గోవిందరావు, సుదురుపాటి తాతాజీ, ఏవి రత్నకుమారి, గుండా రమేష్ గుప్తా, ఏరువాకల నారాయణ రావు, కారుకుండి కన్నబాబు, బేతి ఈశ్వరరావు, నాగులపల్లి వీర్రాజు, మమ్మిన పైడిరాజు, సుంకర వెంకటేశ్వరరావు, సిహెచ్ వాసు, సూరిశెట్టి సన్యాసిరావు పాల్గొన్నారు.

ఆర్ఇసిఎస్ అవినీతిపై చర్యలు చేపట్టాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆర్ఇసిఎస్ అవినీతికి సంబంధించి బాధ్యులపై చర్యలు చేపట్టాలని కోరుతూ గురువారం జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవికి జనసేన నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జనసేన చోడవరం నియోజవర్గ ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్.రాజు, అనకాపల్లి నాయకులు దూలం గోపి మాట్లాడుతూ అనకాపల్లి, చోడవరం, ఎలమంచిలి, పెందుర్తి, గాజువాక నియోజకవర్గాలకు చెందిన పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా చేస్తున్న ఆర్ఇసిఎస్‌లో వందల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని తెలిపారు. ఇందుకు సంబంధించి గతంలో ఏర్పాటు చేసిన ఎంక్వైరీ రిపోర్టులపై ఇప్పటివరకు ఎటువంటి చర్య తీసుకోలేదన్నారు. రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్, ఆర్ఇసిఎస్ పాలకవర్గం ఛైర్మన్‌గా పనిచేసిన బొడ్డేడ ప్రసాద్, కొద్ది మంది అధికారులు (ఎండీ కృష్ణంరాజు, శ్యామల, జుత్తాడ ప్రసాద్, కనకరావు, జ్యోతీశ్వరరావు) సూత్రధారులుగా భారీ కుంభకోణం జరిగిందని ఆరోపించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నేరుగా మంత్రి గుడివాడ అమర్నాథ్ కుటుంబ సభ్యులు కొంతమంది నుండి డబ్బులు వసూలు చేసి నిబంధనలకు విరుద్ధంగా నియామకాల ప్రక్రియ జరిపారని తెలిపారు. కొంతమంది ఉద్యోగులు పనిచేయకుండా జీతాలను పొందడం తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై ఏపీఈపీడీసీఎల్ సిఎమ్‌డిని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జనసేన పార్టీ నాయకులు తాడి రామకృష్ణ, భరణికాన రాము పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో అధిక పోషకాహారం

ప్రజాశక్తి - కశింకోట : చిరుధాన్యాల్లో పోషకాహారం ఎక్కువగా ఉంటుందని ఐసిడిఎస్ సిడిపిఓ ప్రభావతి అన్నారు. మండలంలోని జమాదులపాలెం గ్రామంలో పౌష్టికాహార మాసోత్సవం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఇస్తున్నా పోషకాహారం కిట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కరక రాజ్యలక్ష్మి శేషు, సూపర్ వైజర్ సిహెచ్ వంశీ ప్రియా, ఎమ్‌పిటిసి గూడప్ప లక్ష్మిరాజు, మహిళ పోలీసు సంతోష్, ఎఎన్ఎం చంద్రమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు గంగవేణి, సూర్య కుమారి, రజనీ, పార్వతి, రమణమ్మ, సుబ్బలక్ష్మి, నాగలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రాము

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ముఠా కార్మికుల సంక్షేమానికి సమగ్రమైన చట్టం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఠా కార్మికులకు గుర్తింపు కార్డులు, పిఎఫ్, ఈఎస్ఐ, పని భద్రత, ప్రమాద బీమా, పెన్షన్ వంటి సదుపాయాలు కల్పించాలని కోరుతూ అచ్యుతాపురంలో గురువారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రైవేటు గోదాముల్లో పనిచేసే కార్మికులు పని భద్రత, ప్రమాద బీమా వంటి సదుపాయాలకు నోచుకోలేదన్నారు. ప్రమాదాల్లో ముఠా కార్మికులు మృతి చెందితే వారి కుటుంబాలను ఆదుకునే నాథుడు లేడని చెప్పారు. ముఠా కార్మికులకు కనీస వేతనాలు నిర్ణయించి అమలు చేయాలన్నారు. అధిక బరువులు మోయడం వలన రోజుకు 12 గంటల నుండి 16 గంటల పని చేయడం వలన చిన్న వయసులోనే వృద్ధాప్య దశకు చేరుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ముఠా కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి, సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. ప్రమాదానికి గురైన ముఠా కార్మికులకు యాజమాన్యం, ప్రభుత్వం వైద్య సేవలు అందించాలని, ప్రమాదంలో చనిపోయిన వారికి రూ.10 లక్షలు, సాధారణ వృద్ధులకు 5 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందజేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.చెంచమ్మ, వి.జోగినాయుడు, పి. రాజు, కే. రామకృష్ణ, ఈ .కోనారి పాల్గొన్నారు.

కొనసాగిన టిడిపి రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి- మునగపాక రూరల్

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ స్థానిక మెయిన్ రోడ్‌లో టిడిపి నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 7వ రోజు గురువారం కూడా కొనసాగాయి. దీక్ష శిబిరాన్ని జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరపు విజయ్ కుమార్ సందర్శించి సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జనపరెడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురాం, ఒంపోలు సర్పంచ్ సూరిబాబు, టిడిపి నాయకులు దాడి ముసలి నాయుడు, బీమరశెట్టి శ్రీనివాసరావు, పెంటకోట విజయ్, విల్లూరి నూక నరసింహారావు పాల్గొన్నారు.

కలెక్టరేట్ : చంద్రబాబుపై మోపిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, జైలు నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ టిడిపి కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతులు గురువారం నిరాహార దీక్ష చేపట్టారు. చంద్రబాబును విడుదల చేయాలని కోరుతూ ఏర్పాటుచేసిన 'మేము సైతం బోర్డు' పై సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల విభాగం విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు ఈసరపు వాసు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ నజీర్, విభిన్న ప్రతిభావంతులు డి.వెంకటేశ్వరరావు, పి.శంకర్, బడిగంటి సురేష్, కురుముజి ఆచారి, నోడగల మోహన్ రంగ, బలివాడ అప్పల రాజు, కారుమూరి నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : కక్షపూరితంగా వైసిపి ప్రభుత్వం జైలుకు పంపిన చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని టిడిపి ఉత్తర నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయబాబు అన్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచనలతో 26వ వార్డు పార్టీ కార్యాలయంలో టిడిపి కార్పొరేటర్ ముక్క శ్రావణి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం రాజమండ్రి సెంట్రల్ జైలుకు పోస్టుకార్డులు పంపే ఉద్యమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షులు మొక్క కిషోర్‌కుమార్, బొద్దేక్ మోహన్, కోయిల వెంకటేష్, గంప ధర్మారావు, సమపాల వరప్రసాద్, టిడిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ సైనికుల నిరసన

కశింకోట : చంద్రబాబుకు మద్దతుగా కశింకోటలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాజీ సైనికులు గురువారం నిరసన తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఉగ్గిన రమణ మూర్తి, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, కాంగ్రెస్‌గుల సతీష్, మళ్ల లోవ కృష్ణ, మాజీ సైనికులు గొంతిన రమణ, శేసగిరిరావు, పంచదార్ల వెంకట రమణ, శంకర్ పాల్గొన్నారు.

ఎంవిఆర్ తీర్థ యాత్ర బస్సు ప్రారంభం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని జమాదులపాలెం గ్రామపంచాయతీకి చెందిన భక్తులతో సింహచలం, అన్నవరం, కనకమహాలక్ష్మి అమ్మవార్ల ఆలయ దర్శనాలకు ముత్యాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం బస్‌లు బయలు దేరాయి. ఈ యాత్రలో పాల్గొన్న భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉదయం పూట అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి వేళకు అల్పాహారం సమకూర్చినట్లు నిర్వాహకులు చెప్పారు. ఈ సందర్భంగా ముత్యాల సతీష్ టీం సభ్యులు రైతులు, గ్రామపెద్దలను, మహిళలను కలిసి సేవా కార్యక్రమాలు, తీర్థయాత్రలకు బస్సులు ఏర్పాటు, ఎంఆఆర్ ట్రస్ట్ ద్వారా నిర్వహించే కార్యక్రమాలు, ఉచిత అంబులెన్స్ సదుపాయాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎంవీఆర్ కార్యాలయం సూపర్ వైజర్ సతీష్ కుమార్, ఎంవిఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత సమస్యలపై వినతి

ప్రజాశక్తి- అనకాపల్లి : మండలంలోని గ్రామీణ ప్రాంత సమస్యలపై అఖిలపక్ష నాయకులు గురువారం ఎంపిడిఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనకాపల్లి మండల అభివృద్ధి అధికారి కార్యాలయం వద్ద 'సేవ్ విలేజెస్' అంటూ ప్లకార్డులతో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బిఎస్‌పి నాయకులు నూది కొండ మాణిక్యాలరావు సిపిఐ నాయకులు కోరిబిల్లి శంకర్రావు, కాంగ్రెస్ నేత కట్టమూరి నూక అప్పారావు, దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా నేత కొల్లి సత్యారావు తదితరులు మాట్లాడుతూ పూర్తిస్థాయిలో సిసి రోడ్లు, మురికినీటి కాలువల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. వీధిలైట్లు వెలగడం లేదని, పారిశుధ్యం పరిస్థితి అధ్వానంగా ఉందని వాపోయారు. దీనిపై ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ ఏ ప్రాంతంలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

25న మహా ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి : జగనన్న గోరుముద్ద పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 25న విజయవాడలో చేపట్టే మహా ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకులు కోన లక్ష్మణ పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక సిపిఐ కార్యాలయంలో ధర్నా పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జగనన్న గోరు ముద్ద పథకంలో పనిచేస్తున్న 86,500 మంది పేద మహిళా కార్మికులు ముదువలే వేతనంతో జీవనం కొనసాగించలేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, వారికి వేతనాలు, జగనన్న మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బొండా హేమలత, బొడ్డు నూకా లమ్మ, పి. ప్రవిత్ర కుమారి, లక్ష్మి, రాణి, మహా లక్ష్మి, సర్వస్వతి పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు రేషన్ పంపిణీ

ప్రజాశక్తి-దేవరపల్లి : మండలంలోని వేచలం పీహెచ్సీ పరిధిలోని క్షయ వ్యాధిగ్రస్తులు పదిమందికి వైద్య అధికారిణి బి. హరిక ప్రభుత్వం నుంచి వచ్చిన రేషన్‌ను గురువారం అందజేశారు. అనంతరం ఆ వ్యాధిగ్రస్తులను సమావేశపరిచి, తీసుకోవలసిన జాగ్రత్తలు, మందులు వేయాల్సిన పద్ధతులను తెలియజేశారు. మందులు అయిపోతున్న సందర్భంలో వారం రోజులు ముందుగానే ఆశా కార్యకర్తలకు, ఏఎన్ఎంలకు తెలియజేసి మందులు పొందవచ్చని తెలిపారు. సకాలంలో మెడిసిన్ వాడడం వలన ఈ రోగాన్ని జయించవచ్చని సూచించారు.

44 మందికి అక్రిడిటేషన్లు మంజూరు

ప్రజాశక్తి- అనకాపల్లి : కలెక్టర్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో కొత్తగా 44 మంది విలేకరులకు ప్రెస్ అక్రిడిటేషన్లు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. ఇంతకుముందు 234 మంది విలేకరులతో కలిపి మొత్తం 278 మంది ప్రింట్, టీవీ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు మంజూరు చేసినట్లు ఆయన వివరించారు. ఈ సమావేశంలో కన్వీనర్ డిఐపిఆర్ఓ కే.ఇంద్రావతి, కమిటీ సభ్యులు కె.చంద్రరావు, టి.రమేష్, వి లోవరాజు, కే.చంద్రశేఖర్, షేక్ చాంద్ బాషా, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ బి.భానుమూర్తి, డిపిఆర్ఓ డి.సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన మంత్ర టీం

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం 'మంత్ర' టీం సందర్శించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5, 6, 7 తరగతులకు బోధిస్తున్న ఆంగ్లం, గణితం అధ్యాపకులకు ఈ బృంద సభ్యులు ప్రత్యేక శిక్షణ ఇచ్చి, బాల్య దశ నుంచే విద్యార్థులకు ఆంగ్ల భాష, గణిత శాస్త్రంపై అవగాహన కల్పించడం, పిల్లల్లో అభిలాషను పెంచడం ఈ కార్యక్రమం ఉద్దేశమని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దేవరశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. ఐదో తరగతికి బ్రిడ్జ్ కోర్సు, 6, 7 తరగతులకు ప్రాజెక్ట్ ఆధారిత బోధనా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనకాపల్లి గురుకుల పాఠశాలలో విద్యార్థుల ప్రగతి బాగుందని, అడిగే ప్రశ్నలకు చక్కటి స్పందన లభించిందని మంత్ర టీం సభ్యుడు రవికాంత్ తెలిపారు. ఆంగ్ల అధ్యాపకురాలు రమ్య ప్రియాంక, గణిత అధ్యాపకులు ధనంజయ కుమార్, కె.గోవింద్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

23న దళిత గర్జనను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : ఈనెల 23వ తేదీన నర్సీపట్నంలో దళిత సేవా పరిరక్షణ, దళితు కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగే జిల్లా దళిత గర్జనను జయప్రదం చేయాలని దళిత సేవా పరిరక్షణ జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాక మధుబాబు, జై భీమ్ సేన సేవా సంఘం జిల్లా కార్యదర్శి బి శివ గణేష్ పిలుపునిచ్చారు. స్థానిక ఎస్సీ కాలనీలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద గోడ పత్రికను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అట్రాసిటీ చట్టంలో 41 ఏ నోటీసు రద్దు చేయాలని, రిజర్వేషన్లను సక్రమంగా అమలు చేయాలని, దళితులపై దాడులు అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం శివప్రసాద్, ఎం మహేష్, రాజేష్, సీతారాం, వినోద్ అర్జున్, అభి, పరదేశి, పండు పాల్గొన్నారు.

పలు చోట్ల అన్న సమారాధనలు

ప్రజాశక్తి- కె.కోటపాడు : కె.కోటపాడు మండలం చౌడువాడ గ్రామంలో గురువారం వినాయక నవరాత్రి ఉత్సవాల్లో సందర్భంగా శిలపరెశెట్టి వారి వీధిలో భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సుమారుగా 3000 మంది ప్రజలు పాల్గొన్నారు. మధ్యాహ్నం పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించి, రాత్రికి వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని బొద్దపువానిపాలెం కాలనీలో వినాయక చవితి మహోత్సవం సందర్భంగా గురువారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పరవాడ మాజీ జడ్పిటిసి బద్దపురం వెంకటరమణ దంపతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొద్దపు శ్రీనివాసరావు, వైసిపి కార్యకర్తలు బొద్దపు చిన్నారావు, బొద్దపు వెంకటరమణ, కాలనీ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని ఎం జగన్నాధపురం గ్రామంలో బుధవారం రాత్రి బాలగణపతి యంగ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.

తిరుపతి పాదయాత్రకు స్వాగతం

ప్రజాశక్తి- కశింకోట : శ్రీకాకుళం జిల్లా పొలింకి మండలంలోని అంపలాం గ్రామం నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం దైవ దర్శనానికి నల్లాడు శ్రీహరి, కె.ఆనందరావు చేపట్టిన పాదయాత్ర గురువారం కశింకోట గ్రామానికి చేరుకుంది. గ్రామస్తులు సాదరంగా స్వాగతం పలికారు. ఈ పాదయాత్రలో నల్లాన రమేష్ పాల్గొన్నారు.



స్వాగతం పలికిన బుల్లిబాబు, గ్రామస్తులు

ఘనంగా గురజాడ జయంతి


ఎస్.రాయవరంలో నివాళి అర్పిస్తున్న రిటైర్డ్ వీసీ

ప్రజాశక్తి-యంత్రాంగం:నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు 161 జయంతి వేడుకలను అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు గురజాడ చిత్ర పటానికి పలువురు నివాళులర్పించారు.

ఎస్.రాయవరం:గురజాడ అప్పారావు జన్మదినం సందర్భంగా ఆయన జన్మస్థలం రాయవరంలో ఘనంగా నిర్వహించారు. గురజాడ ఫౌండేషన్ అధ్యక్షులు కర్రీ వెంకటేశ్వరరావు గురజాడ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నన్నయ్య యూనివర్సిటీ రిటైర్డ్ వైస్ ఛాన్సలర్ ముత్యాల నాయుడు మాట్లాడుతూ, గురజాడ అడుగుజాడల్లో నడుచుకోవాలని తెలిపారు. గురజాడకు వైఎస్ఆర్సిపి పార్టీ జిల్లా సెక్రెటరీ కొనతల శ్రీనివాసరావు, జన విజ్ఞాన వేదిక అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కొలగాని వరప్రసాద్, స్కూల్ చైర్మన్ వాసు నివాళు లర్పించారు.

నక్కపల్లి:మండలంలో పెదబోదుగల్లం హైస్కూలులో నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు 161 జయంతి వేడుకలను గురువారం హెచ్ఎమ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, ఫల్గుణరావు, కుమారి, చిన్నారావు, రమేష్ బాబు, శ్రీదేవి పాల్గొన్నారు

నర్సీపట్నం టౌన్:స్థానిక ఐదు రోడ్ల జంక్షన్ వద్ద గ్రంథాలయంలో గురజాడ అప్పారావు జయంతి పురస్కరించుకొని జనవిజ్ఞాన వేదిక, నర్సీపట్నం శాఖ గ్రంథాలయం సంయుక్తంగా ఉపన్యాస పోటీలు నిర్వహించారు. బహుమతులు అందజేశామని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కె.త్రిమూర్తులు తెలిపారు.అల్లూరి సీతారామరాజు డిగ్రీ కళాశాల విశ్రాంత తెలుగు అధ్యాపకులు జెట్టి ఎల్లమంద, విశ్రాంత మండలాభివృద్ధి అధికారి రామరాజు న్యాయ నిర్నేతలుగా వ్యవహరించారు.

కొత్తకోట:పి.కొట్నాబిల్లి పాఠశాలలో గురజాడ చిత్రపటానికి సిఆర్ఎంటి (సిఆర్పి) గుంటూరు రామారావు, విద్యార్థులు నివాళులర్పించారు.

గొలుగొండ:స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి ఎన్. రాజుబాబు గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళా కానిస్టేబుల్ రమ్య, ఏఎన్ఎం వరలక్ష్మి, పంచాయతీ సెక్రెటరీ రమణ పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యాన గురజాడ జయంతి

ములగాడ: 63వవార్డు క్రాంతినగర్‌లో ఐద్వా ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు చిత్రపటానికి ఐద్వా నేత పూడి దొడ్డమ్మ పూలమాలవేసి నివాళులర్పించారు, ఐద్వా మల్కాపురం జోన్ కార్యదర్శి ఆర్.విమల, వై.కల్యాణి, డి.కళావతి, కె.కుమారి, గీతాపద్మ గోవిందమ్మ, కె.జనా, వెంకటరత్నం పాల్గొన్నారు.

తగరపువలస : స్థానిక శ్రీకృష్ణా జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో ఐద్వా, శ్రీకృష్ణ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో గురజాడ జయంతి నిర్వహించారు. సొసైటీ చైర్మన్ బి.నరసింగరావు, ఐద్వా భీమిలి డివిజన్ కన్వీనర్ కె నాగరాణి, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ప్రియాంక, జిల్లా కమిటీ సభ్యులు కుమారి, ఎస్ఎఫ్ ఐ నాయకులు తేజ శ్రీ పాల్గొన్నారు.

గాజువాక.: ఐద్వా ఆధ్వర్యంలో స్వతంత్రనగర్‌లో గురజాడ చిత్రపటానికి పూలమాలేసి నివాళు లర్పించారు.ఐద్వానేతలు జిలక్ష్మి, ఎం. శ్రీదేవి, ఎ.పూజ, స్థానికులు పాల్గొన్నారు.

పిఎం పాలెం: ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ జి ప్రియాంక, చంద్రంపాలెం జెడ్‌పిహెచ్ఎస్ హెచ్ఎం రాజబాబు, యుటిఎఫ్ జిల్లా నేత కె.నాగేశ్వరరావు గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఐద్వా జోన్ కార్యదర్శి బి భారతి, అధ్యక్షులు కె.సుజాత, పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షులు బి మీన, నాయకులు పిల్ల సూరిబాబు, కె. పుష్ప, టి కే శారద, పి పద్మ పాల్గొన్నారు.

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన..

గాజువాక:జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గాజువాక, మింది, అక్కిరెడ్డిపాలెం, గంగవరంలోని ప్రైవేటు ,ప్రభుత్వ పాఠశాలలో గురజాడ అప్పారావు జయంతి నిర్వహించారు సుందరయ్య కాలనీ, శ్రీనగర్, పెదగంట్యాడ, బిసి.రోడ్డు గాజువాక ప్రాంతాల్లో స్వామి విద్యానికేతన్, శ్వేతశ్రీ విద్యానికేతన్, రవీంద్ర స్కూల్, రాఘవేంద్ర స్కూల్, సాయి విద్యానికేతన్, విజేత విద్యానికేతన్ యశోద విద్యానికేతన్, గిరీష్ విద్యానికేతన్, న్యూఏరా హైస్కూల్ తదితర ప్రాంతాల్లో గురజాడ జయంతిలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సికె.పరశురాం, జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ లక్ష్మణస్వామి, గాజువాక అధ్యక్ష కార్యదర్శులు ఎల్.కృష్ణారావు, ఎం.సింహాచలం ఢిల్లీరావు, వాసుదేవరావు, పాల్గొన్నారు.

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి నరసింహ ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు.

పెందుర్తి : పెందుర్తి శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిని బి సూర్యకళ ఆధ్వర్యంలో గురజాడ జయంతి నిర్వహించారు. సాంఘిక దురాచారాల నిర్మూలనతో గురజాడ కృషిని కొనియాడారు.

ఎంవిపి కాలనీ : ఆంధ్రవిశ్వకళాపరిషత్ తెలుగు విభాగం ఆధ్వర్యాన గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన సాగిన కార్యక్రమంలో ఎవిఎన్ కళాశాల విశ్రాంతాచార్యులు డాక్టర్ ఎస్.పోలయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆచార్య జి.యోహాన్‌బాబు, డాక్టర్ ఎ.సీతారత్నం, డాక్టర్ ఎ.ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి : స్థానిక గురజాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగువిభాగం ఆధ్వర్యాన గురజాడ అప్పారావు 161వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కళాశాలలోని గురజాడ విగ్రహానికి ప్రిన్సిపల్ డాక్టర్ పి.చంద్రశేఖర్, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వి.సత్యనారాయణ, డాక్టర్ విజయలక్ష్మి, సుజాత, కుమారి నాగలక్ష్మి, సుధా పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక శాఖా గ్రంథాలయంలో గురజాడ చిత్రపటానికి గ్రంథాలయాధికారి వి.శిరీష పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు నాగేశ్వరి, భవిత కేంద్రం సిబ్బంది సింహాద్రి, చందు, నళిని పాల్గొన్నారు.

దేవరాపల్లి : తన రచనల ద్వారా తెలుగు నాట సాంఘిక పరివర్తనకు కృషి చేసిన మహాకవి గురజాడ అప్పారావు అని స్థానిక గ్రంథాలయాధికారి ఓ.శ్రీనివాసరావు అన్నారు. దేవరాపల్లి గ్రంథాలయంలో గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ-2 స్కూల్ విద్యార్థులు, పాఠక అభిమానులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : స్థానిక శాఖా గ్రంథాలయంలో గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి దొడ్డి కోటేశ్వరరావు, అచ్యుత స్కూల్ ఉపాధ్యాయులు దేనియల్, పెద్దరాజు సాయి వెంకట్, విద్యార్థులు పాల్గొన్నారు.

పరవాడ : అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యాన పరవాడ మహిళ జూనియర్ కళాశాలలో గురుజాడ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఐద్వా ఐద్వా అధ్యక్షురాలు పి.మాణిక్యం, కళాశాల అధ్యాపకులు గురజాడ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడారు. జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ నారాయణ రావు, తెలుగు పండితులు లక్ష్మీకాంత్, నిర్మల, విద్యార్థినులు పాల్గొన్నారు.


పరవాడలో నివాళులర్పిస్తున్న ఐద్వా మహిళా నేతలు


మాట్లాడుతున్న ఎంవిఆర్ ప్రతినిధులు

ప్రజలకు మరెన్నో సేవలు

ఎంవిఆర్ ప్రతినిధులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:ప్రముఖ వ్యాపార వేత్త ముత్యాల వెంకటేశ్వరరావు ఎంవిఆర్ రాజకీయాల్లోకి వస్తే ఇంకా మరెన్నో సేవలు అందించడం జరుగుతుందని పిఆర్‌వో సతీష్ కుమార్, ప్రతినిధులు తెలిపారు. స్థానిక హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సతీష్ మాట్లాడుతూ, ఎంవిఆర్ చారిటబుల్ ట్రస్ట్ నుండి ఇప్పటికే అనేక సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి గ్రామంలోనూ ఉచిత తీర్థయాత్రల బస్సుల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉచిత అంబులెన్స్‌లు ఏర్పాటు, పేద విద్యార్థులకు విద్యాసంబంధిత పరికరాలు పంపిణీ ఇలా అనేక కార్యక్రమాలు ఎమ్ వి ఆర్ చారిటబుల్ ట్రస్ట్ నుండి అందిస్తున్నామని తెలిపారు. తాను బ్యాంకు ఎంప్లాయ్ గా పనిచేస్తూ ఆయన సేవలను చూసి వచ్చానన్నారు.భవిష్యత్తులో ఎంవీఆర్ మరెన్నో సేవలు అందించాలంటే రాజకీయాల్లోకి రావడం ఎంతైనా అవసరం ఉందని ఆయన ఆలోచించినట్లు తెలిపారు. చోడవరం, మాడుగుల, అనకాపల్లి నియోజకవర్గాల్లో మెడికల్ క్యాంపు లు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జి నానాజీ, సూరి పాల్గొన్నారు.


విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపిపి

పెరటి కోళ్లు పంపిణీ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్థానిక మహిళా సమాఖ్య భవనం వద్ద ఏపిఎం పార్వతి భాయ్ ఆధ్వర్యంలో ఎంపీపీ సుర్ల రాజేశ్వరి చేతుల మీదుగా గురువారం పెరటి కోళ్ళు పంపిణీ చేశారు. మండల మహిళా సమాఖ్య ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పార్వతి బాయ్ మాట్లాడుతూ, ఒక్కొక్క గ్రామ సంఘానికి ఒక యూనిట్ చొప్పున 25 యూనిట్లు 275 కోళ్ళ పంపిణీ చేసామన్నారు. ఒక్కొక్క యూనిట్ ధర 3950, కిచెన్ గార్డెన్ కి సంబంధించిన విత్తనాలు 125 యూనిట్స్ ఒక్కొక్క ప్యాకెట్ రూ.60 చొప్పున పంపిణీ చేసామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఇన్నం రమణ రత్నం , ఎంఎల్‌ఓ చంద్రశేఖర్, సర్పంచ్ లు, ఏట రమణబాబు, సీసీలు రాజశేఖర్, రామలక్ష్మి, జగదీష్, అకౌంటెంట్ శాంతి పాల్గొన్నారు.


పర్యవేక్షిస్తున్న వైద్యుల బృందం

పిహెచ్‌సి సందర్శన

ప్రజాశక్తి-కొత్తకోట:పెరుగుతున్న జనాభాకు అను గుణంగా అందుతున్న వైద్యసేవలను సమీక్షించేందుకు వైద్యులు ఎల్ల రమణ, శ్రీనివాస్ బృందం కొత్తకోట పిహెచ్‌సిని సందర్శించారు. ఈ సందర్భంగా పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ ద్వారా జరుగుతున్న సర్వేను పరిశీలించారు. పిహెచ్‌సి పరిధిలోఅందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలు -ఆమలు, ప్రజలకు ఏ మేరకు వైద్య సేవలు అందుతున్నాయో వైద్యాధికారి రజనిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ రామారావు, హెచ్ వి.విజయ, ఫార్మసిస్ట్ పద్మ పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని జోగుంపేట గ్రామ పంచాయతీలో సర్పంచ్ జువ్వల లక్ష్మి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. గురువారం గ్రామ పంచాయతీలో వార్డుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ద్వారకానగరం సెంటర్ నుండి పాత జోగుంపేట వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో జువ్వల దేముడు, వార్డు మెంబరు చిట్ల అప్పలకొండ పాల్గొన్నారు.


పనులు చేయిస్తున్న సర్పంచ్

స్కూల్ గేమ్స్‌లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్‌పురం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జరిగిన స్కూల్ గేమ్స్‌లో పాకలపాడు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు పలు క్రీడల్లో ప్రతిభ కనబర్చారు. ఈ విద్యార్థులు నియోజకవర్గ స్థాయిలో ఆడతారని పిడి జి.ప్రసాద్ తెలిపారు. విద్యార్థులను హెచ్ఎం ఎంఎస్.ప్రసాద్, స్కూల్ కమిటీ చైర్మన్, సర్పంచ్ అభినందించారు.


ప్రతిభ చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

గ్రావెల్ లారీలు సీజ్

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:అక్రమంగా తరలిస్తున్న ఆరు గ్రావెల్ లారీలు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తహశీల్దార్ కె. విజయ్ కుమార్ తెలిపారు. బుధవారం రాత్రి సమయంలో తహశీల్దార్ కార్యాలయం ముందు నుండి వెళుతున్న ఆరు టిప్పర్ లారీలను రెవెన్యూ అధికారులు రికార్డులు చూశారన్నారు. 5 లారీలకు బిల్లులు లేకపోడంతో వాటిని సీజ్ చేసినట్టు తహశీల్దారు తెలిపారు.





సిఎం సహాయనిధి పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే గణేష్

సిఎం సహాయ నిధి అందజేత

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:మున్సిపాలిటీలోని బలిఘట్టం 17వ వార్డుకి చెందిన పారుపల్లి అప్పలస్వామి నాయుడుకు ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అందజేశారు. కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న అప్పలస్వామి కుటుంబ సభ్యులు ఎంఎల్‌ఏ దృష్టికి తీసుకెళ్లడంతో సీఎం సహాయనిధి అందజేసినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి కింద లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్‌కు రూ.10 లక్షలను అందించడం జరిగిందన్నారు.



సిద్ధం చేసిన క్రీడా మైదానం

నియోజక వర్గ క్రీడా పోటీలకు సిద్ధం

ప్రజాశక్తి -చీడికాడ:ఈనెల 22న శుక్రవారం నుండి నియోజకవర్గ స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ కె బొంజు బాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ క్రీడా పోటీలలో అండర్ 17,14 కబడ్డి, వాలీబాల్, త్రో బాల్, కోకో, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, సెటిల్ బ్యాడ్మింటన్, యోగ సుమారు 9 క్రీడా రంగాలలో విద్యార్థులను నియోజవర్గ స్థాయిలో ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. ఈ క్రీడా పోటీలకు మండల కేంద్రమైన జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. మాడుగుల, చీడికాడ, దేవరపల్లి, కె.కోటపాడు నాలుగు మండలాల నుంచి విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.



పరిశీలిస్తున్న అధికారులు

స్పందన అర్జీపై విచారణ

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండల కేంద్రం లో బుధవారం నిర్వహించిన జగన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కు గిరిజన రైతులు అందించిన ఆర్జీల పరిష్కారంపైఅసిస్టెంట్ కలెక్టర్ స్మరణారాజు, నర్సీపట్నం ఆర్డీవో జయరాం గురువారం చీమలపాడు గ్రామంలో బహిరంగ విచారణ నిర్వహించారు. ఈ మేరకు చీమలపాడు పంచాయితీ ములకలాపల్లి గ్రామానికి చెందిన గిరిజన రైతులు కవల చంద్రయ్య, శెట్టి రాజులమ్మ, అనంతలక్ష్మి తమ జిరాయితీ భూములు 22ఎ లో తప్పుడుగా రికార్డు అయ్యాయని, దీంతో తాము అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నామని బుధవారం నాటి స్పందనలో జిల్లా కలెక్టర్ కు ఆర్జీ ఇచ్చారు. ఈ మేరకు ఆయన దీనిపై విచారణకు అసిస్టెంట్ కలెక్టర్ రికార్డులన్నీ పరిశీలించారు. నివేదికను జిల్లా కలెక్టర్ సమర్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహేశ్వరరావు, ఆర్ఐ చినబ్బాయి పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న కేంద్ర బృందం సభ్యులు

జల్ జీవన్ మిషన్ పనులపై

కేంద్ర బృందం ఆరా

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో జరుగుతున్న జల్ జీవన్ మిషన్ పనులపై గురువారం జాతీయ బృందం జగ్గంపేట శివారు కె.బి అగ్రహారం గ్రామంలో పర్యటించారు. సుశీల్ కుమార్ చౌబే, ఇష్ వర్ చంద్జెన్ ఆధ్వర్యంలో జల్ జీవన్ మిషన్ ద్వారా జరిగిన పనులను పరిశీలించారు. గ్రామంలో సరఫరా అవుతున్న నీటి వివరాలు వాటిలో ఉండాల్సిన మినరల్స్ మోతాదు, సహజ నీటి వనరులు, సంపద సృష్టి కేంద్రాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, గ్రామ సర్పంచ్ రమణ, డిప్యూటీ ఇంజనీర్ నాగేశ్వరరావు, మండల గ్రామీణ నీటి సరఫరా అధికారి గీతాంజలి, కరుణ పాల్గొన్నారు.

పర్యావరణం, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే..

బల్క్ డ్రగ్ యూనిట్ల ఏర్పాటుపై నిరసన

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి ప్రాంతంలో బల్క్ డ్రగ్ యూనిట్స్ నెల కొల్పడానికి రాష్ట్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయం వెంటనే ఉప సంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మత్స్యకారులు డిమాండ్ చేశారు. మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో గురువారం సిపిఎం ఆధ్వర్యంలో మత్స్యకారులు బల్క్ డ్రగ్ యూనిట్స్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. బల్క్ డ్రగ్ యూనిట్స్ ఏర్పాటు వద్దే వద్దని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లా డుతూ, నక్కపల్లి మండలంలో వైజాగ్- చెన్నై ఇండస్ట్రీల్ కారిడార్ ఏర్పాటకు సేకరించిన భూములలో బల్క్ డ్రగ్ యూనిట్లు నెల కొల్పడానికి ఏపీ రాష్ట్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అత్యంత ప్రమాదకరమైన, కాలుష్య కారకమైన ఈ బల్క్ డ్రగ్ యూనిట్లు కాకినాడ ఎస్ఇజెడ్ లో నెల కొల్పడాన్ని ఆ ప్రాంత మత్స్యకారులు, ప్రజలు వ్యతిరేకిస్తే, ఆ యూనిట్ లను నక్కపల్లి ప్రాంతంలో ఏర్పాటు చేయాలని చూడటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ ప్రాంత ప్రజలు వ్యతిరేకించరనా? లేక ఇక్కడ ప్రజలు ఏమైపోయినా పర్వాలేదనా అని ప్రభుత్వాన్ని నిలదీసారు. అభివృద్ధికి, పరిశ్రమల స్థాపనకు తాము వ్యతిరేకం కాదని, పర్యావరణానికి నష్టం కలిగించే, సముద్రాన్ని కలుషితం చేసే రసాయన తుల్య పరిశ్రమలు ఏర్పాటు చేస్తే మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.కారిడార్ పేరుతో సేకరించిన భూములలో పర్యావరణం, పచ్చదనం దెబ్బతినకుండా మత్స్యకారుల చేపలు వేటకు నష్టం కలగకుండా ఉండే విధంగా పరిశ్రమలు ఏర్పాటు చేసి ఈ ప్రాంత వాసులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో హెటిరో డ్రగ్స్ కంపెనీ వ్యర్థ రసాయన జలాలు సముద్రంలోకి వదలడంత సముద్రం కలుషితమై మత్స్య సంపద నశించి పోవడంతో మత్స్యకారులు ఉపాధి కోల్పోయి పోయి పొట్ట చేత పట్టుకుని వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.మహేష్ బాబు, కె.భూలోక, ఎం.నారాయణరావు, సిహెచ్ సోమేష్, వి.శ్రీనువాస్, పి.దావీద్‌రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అప్పలరాజు

కొయ్యూరు జెడ్‌పిటిసి, అనుచరుల దాడిపై

అధికారుల విచారణ

తమను కొట్టారని గిరిజన మహిళల ఆవేదన

ప్రజాశక్తి -రోలుగుంట: తమకు న్యాయం చేయాలని మగవారు లేని సమయంలో వచ్చి దౌర్జన్యం చేస్తే తా ఏమి చేయగలమని మండల తహశీల్దార్ కె.వరహాలు, ఎస్సై నాగకార్తీక్ వద్ద గిరిజన మహిళలు, పిల్లలు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఉదయం చటర్జీపురం గదలు గిరిజనులను వారు సాగు చేసుకుంటున్న పంటలను తహశీల్దార్ కె.వరహాలు, ఎస్సై నాగకార్తీక్, హెడ్ కానిస్టేబుల్ సురేష్ పరిశీలించారు. కొయ్యూరు జెడ్పీటీసీ వారా నూకరాజు నాలుగైదు ఆటోలపై జనాలను తీసుకువచ్చి తమపై దౌర్జన్యం చేశారని గిరిజనులు వాపోయారు. తాత తండ్రుల నుండి ఈ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని నీలాపు అప్పలనాయుడు, కేదారి రాజు, నీలాపు రాజేశ్వరి, నీలాపు నూకన్న తెలిపారు. దౌర్జన్యం చేసి మొక్కలను నరికివేశారన్నారు. భూమి విషయమై కోర్టులో తేల్చుకోవాల్సిన ఉండగా దౌర్జన్యం చేస్తే తాము ఎవరికి చెప్పుకోవాలని ఆవేదన వక్యక్తం చేశారు. గత ఏడాది కంది చేను పంట, పశువుల పాకలకు నిప్పు అంటించి ధ్వంసం చేయించారన్నారు. ఈ విషయమై తహశీల్దార్ వరహాలు మాట్లాడుతూ, 1950 సంవత్సరంలో సర్వే సెటిల్‌మెంట్ అయిందని, అప్పటి నుండి ఇప్పటి వరకు రెవెన్యూ రికార్డులో వీరి తండ్రి తాతల పేర్లు లేవన్నారు. సాగులో ఉండటం వాస్తవమేనని, ఈ పది ఎకరాల 83 సెంట్లు జిరాయితీ భూమి అని ఈ నాలుగు కుటుంబాలకు టైటిల్ డీడ్ ఇవ్వడానికి తమకు ఎటువంటి ఆధారాలు లేవన్నారు. సర్వే చేయించి సాగులో ఉన్నారని జిల్లా అధికారులకు తెలియజేస్తామన్నారు. ఎస్సై నాగకార్తీక్ మాట్లాడుతూ గిరిజనులకు రక్షణ కల్పించే విధంగా పికెటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు.



ఘటనపై అడిగి తెలుసుకుంటున్న అధికారులు, పోలీసులు



రహదారికిరువైపులా ఉన్న తుప్పలు

పేరుకుపోయిన తుప్పలు..

వాహనదారులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో రహదారులకు ఇరువైపులా తుప్పలు ఎక్కువగా పెరిగి పోవడంతో రోడ్డున వెళ్లేవారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా మలుపుల వద్ద, రాత్రి సమయంలో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. మండలంలో వెంకటాపురం రోడ్డు, పాములవాక, పీకే పల్లి అదే విధంగా ప్రధాన రహదారి పోలవరం రోడ్డు ఇరువైపులా తుప్పలు పెరిగి పోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ఏ క్షణాన ఏ ప్రమాదం సంభవిస్తుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను సంబంధిత శాఖ అధికారులు స్పందించి తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

తూర్పుకాపు కమిటీ సమావేశం

ప్రజాశక్తి -గొలుగొండ :మండలం తూర్పు కాపు కమిటీ అధ్యక్షులు పట్టం రమణ అధ్యక్షతన గురువారం గొలుగొండ తూర్పు కాపు కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంకు ఉమ్మడి విశాఖ జిల్లా తూర్పు కాపు కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎవి.రమణయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, విశాఖ జిల్లాలో తూర్పు కాపులు ఉపాధి విద్యా అవకాశాలు లేక అనేక సమస్యలతో జీవిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్, అవంతి శ్రీనివాసరావులు జిల్లాలో అన్ని డివిజన్‌లోని తూర్పు కాపులకు ఉపయోగపడే విధంగా బిసి సర్టిఫికెట్లు జారీ చేయడంలో సహకరించారని తెలిపారు. నాతవరం, పాయకరావుపేట, నక్కపల్లి మండలాల్లో తూర్పు కాపుల ఉత్తర్వులు అమలు చేయలేదన్నారు. దీని అమలుకు కృషి చేస్తున్నామన్నారు.



హాజరైన నేతలు



ఊరేగిస్తున్న అర్చకులు

ఘనంగా బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాక క్షేత్రంలో శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఆంజనేయ వాహనంపై వెంకన్న తిరువీధి సేవ ఘనంగా జరిగింది. దాతలు, భక్తుల సహకారంతో ఉపమాక ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు, తిరువీధి సేవలు విశేషంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా ఆలయాల్లో స్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవమూర్తులను మాఢవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, భాగవంతం సాయి గోపాలాచార్యులు, నండూరి రాజ గోపాలాచార్యులు, రేజేటి సింగరాచార్యులు, ఆఫీస్ అసిస్టెంట్ గురవయ్య, శ్రీవత్స, తాతాజీ పాల్గొన్నారు.

చోరీపై కేసు నమోదు

ప్రజాశక్తి -గొలుగొండ:మండలంలోని పప్పుశెట్టి పాలెం పంచాయతీ రైతు భరోసా కేంద్రంలో టివి, సిసి కెమెరాలు, ఎరువులు నమోదు రికార్డులు దొంగతనం చోరీపై కేసు నమోదు చేశామని ఎస్సై నారాయణరావు తెలిపారు. ఈ విషయమై సచివాలయం సిబ్బంది పిర్యాదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నూతన పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి -డుంబ్రిగుడ:మండలంలోని గసభ పంచాయతీలో నూతనంగా మంజూరైన 21 మంది లబ్ధిదారులకు ఆ పంచాయతీ సిపిఎం సర్పంచ్ పి సునీత గురువారం లబ్ధిదారులకు పింఛన్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పింఛన్లను సద్వినియోగ పరచు కోవాలని ఆమె కోరారు. మాజీ సర్పంచ్ సురేష్ కుమార్, ఉప సర్పంచ్ మహాదేవ్ పాల్గొన్నారు.